తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం సూర్యపేట యాదాద్రి భువనగిరి
మంగళవారం 27 అక్టోబర్ 2026
పేజీలు : 8
Follow :

## నిబంధనలు తీసి మూలన పడేసిన
# రియల్ రాక్ యాజమాన్యం!

- కుక్కడం వద్ద రాంగ్ రూట్‌లో లారీల బీభత్సం రగిలిపోయిన గ్రామస్తులు
- ప్రాణాలు పోతున్నా పట్టించుకోని కంపెనీ నిర్లక్ష్యం
- అవగాహన లేని డ్రైవర్లను రోడ్డుపైకి పంపి ప్రాణాలతో చెలగాటం!
- స్థానికుల ఆగ్రహం లారీల నిలిపివేత, రహదారిపై నిరసన

**మాడుగులపల్లి అక్టోబర్ 26 (జనంసాక్షి):** లాభార్జనే ధ్యేయంగా ప్రమాదకర రీతిలో వాహనాలు నడుపుతూ, ప్రజా ప్రాణాలను గాల్లో దీపాల్లా మారుస్తున్న రియల్ రాక్ కంపెనీ యాజమాన్యం తీరుపై మాడుగులపల్లి మండలం కుక్కడం గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాంగ్ రూట్‌లో యథేచ్ఛగా ప్రయాణిస్తూ వరుస ప్రమాదాలకు కారణమవుతున్న రియల్ రాక్ సంస్థకు చెందిన భారీ లారీలను సోమవారం స్థానికులు అడ్డుకున్నారు.

**నిబంధనలు గాల్లోకి పలుమార్లు చెప్పినా నిర్లక్ష్యమే!**

కుక్కడం గ్రామం గుండా వెళ్తున్న రియల్ రాక్ లారీలు నిత్యం ట్రాఫిక్ నిబంధనలను బొందపెట్టి రాంగ్ రూట్‌లో ప్రయాణిస్తున్నాయని గ్రామస్తులు మండిపడ్డారు ఈ రాంగ్ రూట్ రాకపోకల వల్ల ఇప్పటికే గ్రామం వద్ద పలు చిన్న, పెద్ద ప్రమాదాలు జరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు ప్రమాదాల నివారణపై కంపెనీ యాజమాన్యానికి పలుమార్లు విన్నవించినా, అధికారులకు ఫిర్యాదు చేసినా చెవిటి వాని ముందు శంఖం ఊదినట్లే తయారైందని ధ్వజమెత్తారు.

**డ్రైవర్లకు కనీస అవగాహన లేదా?**

కనీస రోడ్డు భద్రతా నిబంధనలు, ట్రాఫిక్ రూల్స్ కూడా తెలియని డ్రైవర్ల చేతికి భారీ వాహనాలను ఇచ్చి రోడ్లపైకి పంపడం ఎంతవరకు సమంజసమని గ్రామస్తులు ప్రశ్నించారు కంపెనీ యాజమాన్యం




చేస్తోందే ... అయితే, దానికి తోడు అవగాహన లేని డ్రైవర్ల నిర్లక్ష్యం ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు ఇకనైనా యాజమాన్యం తమ వైఖరి మార్చుకోకపోతే, రోడ్డు భద్రత పాటించకపోతే లారీల రాకపోకలను శాశ్వతంగా అడ్డుకుంటామని హెచ్చరించారు.

**అధికారులు తక్షణమే స్పందించాలి**

అధికారుల ఉదాసీనత వల్లే ఇటువంటి సంస్థలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని, ఇప్పటికైనా పోలీసులు, రవాణా శాఖ అధికారులు స్పందించి రాంగ్ రూట్‌లో వస్తున్న రియల్ రాక్ లారీలపై కఠిన చర్యలు తీసుకోవాలని కుక్కడం గ్రామస్తులు డిమాండ్ చేశారు.




## బ్రిక్స్ సమావేశాలకు బయలుదేరిన తెలంగాణ మండలి చైర్మన్ గుత్తా, స్పీకర్ గడ్డం ప్రసాద్

**నల్లగొండ ప్రతినిధి,అక్టోబర్ 26,(జనంసాక్షి):** ఢిల్లీలో జరుగుతున్న బ్రిక్స్ సమావేశాల్లో పాల్గొనేందుకు తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ సోమవారం ఉదయం హైదరాబాద్‌లోని శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా విమానాశ్రయంలో వారు మాట్లాడుతూ, బ్రిక్స్ సమావేశాల వేదికపై తెలంగాణ గొంతును బలంగా వినిపిస్తామని స్పష్టం చేశారు.వారి వెంట తెలంగాణ శాసనమండలి కార్యదర్శి డాక్టర్ నరసింహాచార్యులు, స్పీకర్ ఓఎస్డీ వెంకటేష్, శాసనమండలి చైర్మన్ ఓఎస్డీ గోవర్ధన్ రెడ్డి తదితరులు ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు.

# పోలీస్ గ్రీవెన్స్ డే
## ఎస్పీ శరత్ చంద్ర పవార్

- బాధితుల నుంచి 45 ఫిర్యాదుల స్వీకరణ
- నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా వాల్మీకి జయంతి

**నల్లగొండ ప్రతినిధి,అక్టోబర్ 26,(జనంసాక్షి):** నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమ వారం మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.



## పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యం



## లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

**భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 26 (జనంసాక్షి):** పోచంపల్లి పట్టణంలోని ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో పట్టణ, మండల పరిధికి చెందిన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

వార్తా లోపలి పేజీలో



మహిళా కండక్టర్‌ను బస్సులో నుంచి తోసిన ఘటన

# నిందితురాలు అరెస్ట్

### టికెట్ విషయంలో వివాదం.. కండక్టర్‌పై నుంచి వెళ్లిన బస్సు చక్రాలు.. మణుగూరు కోర్టుకు తరలింపు

**అశ్వాపురం అక్టోబర్ 26 (జనంసాక్షి):** 25-10-2026న ఆర్టీసీ బస్సులో టికెట్ తీసుకునే విషయంలో మహిళా ప్రయాణికురాలికి, మహిళా కండక్టర్‌కు మధ్య వివాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో ప్రయాణికురాలు బస్సులో నుంచి కండక్టర్‌ను కిందకు నెట్టివేయడంతో ఆమె రోడ్డుపై పడిపోయింది. అదే సమయంలో బస్సు కండక్టర్‌పై నుంచి వెళ్లడంతో ఆమె కాళ్లకు తీవ్ర రక్తగాయాలయ్యాయి.

వార్తా లోపలి పేజీలో

## అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు
# అందించడమే ప్రభుత్వ లక్ష్యం

### స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో ఎమ్మెల్యే పాయం



**బూర్గంపహాడ్ అక్టోబర్ 26 (జనంసాక్షి)** అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పినపాక ఎమ్మెల్యే, తెలంగాణ శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం బూర్గంపహాడ్ మండల మార్కెట్ యార్డులో నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని, పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా

వార్తా లోపలి పేజీలో



## బాలోత్సవ్ -2026 పోస్టర్లను ఆవిష్కరించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**ఖమ్మం, అక్టోబర్ 26,(జనంసాక్షి) :** ఖమ్మం నగరంలో నవంబర్ 11,12వ తేదీలలో ఖమ్మం డాన్సర్స్ అసోసియేషన్,వారధి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్రస్థాయి బాలోత్సవ పోటీలకు సంబంధించిన పోస్టర్లను రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సోమవారం ఆవిష్కరించారు. స్థానిక మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నివాసంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వారధి ఫౌండేషన్ చైర్మన్ చింతనిప్పు కృష్ణ చైతన్య తో కలిసి బాలోత్సవ్ -2026 పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ

వార్తా లోపలి పేజీలో

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో
# కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి
### నూతి సత్యనారాయణ గౌడ్



**మధిర, అక్టోబర్ 26 (జనంసాక్షి):** మధిర మండల, పట్టణ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పారుపల్లి విజయకుమార్ , మధిర పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తలుపుల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ శాసనమండలి మాజీ సభ్యులు, మధిర నియోజకవర్గ పట్టభద్రుల ఎన్నికల ఇంచార్జ్ పొట్ల నాగేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి విజయానికి చేపట్టాల్సిన కార్యాచరణపై నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామం, పట్టణంలోని ప్రతి డివిజన్ పరిధిలో బూత్ లెవెల్ ఏజెంట్లు తమకు కేటాయించిన బూత్‌లలో ఉన్న పట్టభద్రులను గుర్తించి, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు అయ్యేలా కృషి చేయాలని సూచించారు. పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా, ప్రతి అర్హుడికి సమాచారం అందించి, అవసరమైన సహాయ సహకారాలు అందించాలని కోరారు. నవంబర్ 6వ తేదీ వరకు ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగనున్న నేపథ్యంలో, ప్రతి కాంగ్రెస్ నాయకుడు, కార్యకర్త బాధ్యతగా పనిచేయాలని, బూత్ స్థాయిలో సమన్వయంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఓటరు నమోదు కాంగ్రెస్ పార్టీకి అత్యంత కీలకమని, ప్రతి బూత్‌లో అర్హులైన పట్టభద్రుల వివరాలను సేకరించి, వారి నమోదు ప్రక్రియ పూర్తయ్యేలా బీఎల్ఏలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని స్పష్టం చేశారు. శాసనమండలి మాజీ సభ్యులు పొట్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. పట్టభద్రుల సమస్యలను అర్థం చేసుకుని, వారి హక్కుల పరిరక్షణకు కృషి చేసే కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి గారి విజయానికి పార్టీ శ్రేణులందరూ సమిష్టిగా కృషి చేయాలని కోరారు. ఓటరు నమోదు నుంచి ఎన్నికల ప్రచారం వరకు ప్రతి దశలో ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని సూచించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని, బూత్ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేస్తూ పట్టభద్రుల మద్దతును కూడగట్టాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మున్సిపాలిటీ చైర్మన్ సామినేని సుజాత రామనాథం, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కర్నాటి రామారావు, జిల్లా సెక్రటరీలు మిర్యాల వెంకటరమణ గుప్తా, పులిబండ్ల చిట్టిబాబు, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేజెండ్ల సాయి , మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బిలూరి సత్యనారాయణరెడ్డి, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు తూమాటి నవీన్ రెడ్డి, మున్సిపాలిటీ కౌన్సిలర్లు, సర్పంచులు పట్టణ, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# రాష్ట్రస్థాయి మహిళల కబడ్డీ పోటీల పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే జారె..

**దమ్మపేట అక్టోబర్ 26 (జనంసాక్షి):** దమ్మపేట మండలం గండుగులపల్లి అశ్వారావుపేట శాసనసభ్యులు జారె ఆదినారాయణ క్యాంప్ కార్యాలయం నందు రాష్ట్ర రెవెన్యూ గృహనిర్మాణ సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో నిర్వహించనున్న 73వ రాష్ట్రస్థాయి సీనియర్ మహిళల కబడ్డీ పోటీల పోస్టర్‌ను కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పోస్టర్‌ను విడుదల చేశారు. మాజీ టీజీఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు ఆధ్వర్యంలో మువ్వా యూత్ సత్తుపల్లి నిర్వహణలో ఈ కబడ్డీ పోటీలు అక్టోబర్ 28,29, 30 తేదీల్లో సత్తుపల్లిలోని రాణి సెలబ్రేషన్స్ వేదికగా జరగనున్నాయి. ఈ పోటీల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి మహిళా క్రీడాకారిణులు పాల్గొననున్నారు. మహిళలు క్రీడారంగంలో మరింతగా రాణించేందుకు ఇలాంటి రాష్ట్రస్థాయి పోటీలు దోహదపడతాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని మహిళా క్రీడాకారులను ప్రోత్సహించాలని కోరారు.

# ప్రజావాణి దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలి

- సర్వే పనులు నిర్ణీత సమయంలో పూర్తి చేయాలి
- అధికారులను ఆదేశించిన సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ

**భద్రాచలం అక్టోబర్ 26 (జనంసాక్షి)** ప్రజావాణిలో ప్రజలు సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి, సంబంధిత సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ అధికారులను ఆదేశించారు. భూ సమస్యలు, రెవెన్యూ అంశాలు, పింఛన్లు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, నిరుద్యోగుల సమస్యలపై వచ్చిన వినతులకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వివిధ సమస్యలపై దరఖాస్తులను స్వీకరించారు. వాటిని సంబంధిత శాఖల అధికారులకు పంపిస్తూ, అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఫిర్యాదుపై సంబంధిత శాఖాధిపతులు వ్యక్తిగతంగా పర్యవేక్షణ చేపట్టి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని, ఎలాంటి దరఖాస్తులు పెండింగ్‌లో ఉండకుండా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఏఓ భగవాన్‌రెడ్డి, నాయబ్ తహసీల్దార్ వినయ్ శీల శ్రీరామ్‌తో పాటు డివిజన్ పరిధిలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# ఘనంగా మహాకవి వాల్మీకి జయంతి

**ఖమ్మం కార్పొరేషన్ అక్టోబర్ - 26( జనం సాక్షి )** మహాకవి వాల్మీకి రచించిన రామాయణం ద్వారా సమాజానికి ఎన్నో విలువలు అందాయని వైరా శాసనసభ్యులు మాలోతు రాందాస్ నాయక్ అన్నారు. మహాకవి వాల్మీకి జయంతిని పురస్కరించుకొని సోమవారం జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ మొదటి అంతస్తులోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన జయంతి వేడుకల్లో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని మహాకవి వాల్మీకి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగాఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ మహాకవి వాల్మీకి రామాయణాన్ని రచించి, ఆ గ్రంథం ద్వారా సమాజానికి అనేక విలువలను అందించారని పేర్కొన్నారు. రామాయణం ద్వారా ఆదర్శ మానవుడికి ఉండవలసిన లక్షణాలు, మానవ సంబంధాలు, నైతిక విలువలను మహాకవి వాల్మీకి మనందరికీ బోధించారని అన్నారు. మహాకవి వాల్మీకి రచించిన రామాయణం కారణంగా మన దేశంలో కుటుంబ వ్యవస్థ పటిష్టంగా ఉందని ఎమ్మెల్యే తెలిపారు. నేడు ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన వసుధైక కుటుంబం అనే భావన కూడా రామాయణంలోని విలువలతో ముడిపడి ఉందని పేర్కొన్నారు. మహాకావ్యమైన రామాయణాన్ని రచించిన మహాకవి వాల్మీకి జయంతిని పండుగగా జరుపుకోవడం సంతోషకరమని అన్నారు. మహర్షి వాల్మీకి జీవిత విశేషాలు, ఆయన రచించిన రామాయణంలోని ఆదర్శాలు నేటి సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. శ్రీనివాస రెడ్డి, జిల్లా బిసి అభివృద్ధి అధికారిణి జి. జ్యోతి, వివిధ సంఘాల నాయకులు మల్లికార్జున, రామ చంద్రరావు, దగ్గు శ్రీనివాసరావు, ఉపేందర్, నరసింహారావు, వెంకటేశ్వర్లు, మల్లేశ్వరరావు, మల్లికార్జున రావు, నర్సయ్య, బీసీ కుల సంఘాల నాయకులు, వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ కార్యాలయ సిబ్బంది, షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# ప్రజల ప్రాణాలు పోతేనే అధికారులకు చలనం వస్తుందా?

- అబ్బుగూడెం-కట్టుగూడెం రహదారి దుస్థితిపై బీజేపీ ఆగ్రహం
- ఎదుళ్ల వాగుపై హై లెవల్ బ్రిడ్జి నిర్మించాలని కలెక్టర్‌కు వినతి

**అన్నపురెడ్డిపల్లి అక్టోబర్ 26 (జనంసాక్షి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలం లోని అబ్బుగూడెం కట్టుగూడెం రహదారి దుస్థితిపై బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎదుళ్ల వాగు వద్ద దెబ్బతిన్న లో లెవల్ కాజ్‌వే కారణంగా ప్రజలు ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రజలకు ప్రాణనష్టం జరగకముందే సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు.

**ఏళ్లుగా ఇదే దుస్థితి.. పట్టించుకోని అధికారులు!**

అబ్బుగూడెం?కట్టుగూడెం ప్రధాన రహదారిపై ఉన్న ఎదుళ్ల వాగు లో లెవల్ కాజ్‌వే దెబ్బతిని ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులు చేపట్టకపోవడంపై బీజేపీ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. రహదారిపై భారీ గుంతలు, పగుళ్లు ఏర్పడటంతో పాటు ప్రమాద సూచిక బోర్డులు, రక్షణ గోడలు లేకపోవడం ప్రయాణికులకు ముప్పుగా మారిందని పేర్కొన్నారు. ఈ మార్గంలో ప్రయాణించే విద్యార్థులు, రైతులు, అత్యవసర వైద్య సేవల కోసం వెళ్లే రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమస్యపై పత్రికల్లో పలుమార్లు కథనాలు ప్రచురితమైనా అధికారుల్లో స్పందన లేకపోవడం విచారకరమని విమర్శించారు.



**ప్రజా సమస్యపై బీజేపీ పోరుబాట**

స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని బీజేపీ జిల్లా ఎస్టీ మోర్చా ప్రధాన కార్యదర్శి మొగిలి రామకృష్ణ, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు బన్నె శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నాయకులు ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ప్రమాదకరంగా మారిన రహదారిపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఒక ప్రాణం పోయాకే అధికారులు స్పందిస్తారా? అని ప్రశ్నిస్తూ, ప్రజల భద్రత విషయంలో నిర్లక్ష్యం తగదని స్పష్టం చేశారు.

**బీజేపీ ప్రధాన డిమాండ్లు ఇవే..**

ఎదుళ్ల వాగుపై ప్రమాదకరంగా ఉన్న లో లెవల్ కాజ్‌వే స్థానంలో హై లెవల్ బ్రిడ్జి నిర్మించాలి. రహదారిపై ఏర్పడిన భారీ గుంతలను పూడ్చి శాశ్వత మరమ్మతులు చేపట్టాలి. ప్రయాణికుల భద్రత కోసం రక్షణ గోడలు, ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి.



కేవలం హామీలతో సరిపెట్టకుండా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, పనులను తక్షణమే ప్రారంభించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణాలకు భరోసా కల్పించేలా జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించాలని కోరారు.

జనంసాక్షి

పోలేపల్లిలో భక్తిపారవశ్యం

# కన్నులపండువగా అయ్యప్ప 'మహా పడిపూజ'

## రామన్నపేట భక్త బృందం భజనలు భేష్



**ఖమ్మం రూరల్, అక్టోబర్ 26 (జనంసాక్షి):** ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లి గ్రామం శరణుఘోషతో మారు మోగింది. గ్రామానికి చెందిన కన్నె స్వామి దండగల వీరబాబు నివాసంలో శ్రీ అయ్యప్ప స్వామి వారి మహా పడిపూజ వేడుక అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధల నడుమ నిర్వహించబడింది.

**శాస్త్రోక్తంగా అభిషేకాలు...**

గొలుసుల తిరుమలరావు గురుస్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్వామివారికి పాలు, తేనె, నెయ్యి, సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. పూజా పీఠాన్ని నానావిధ పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి పడిపూజను సోమవారం వైభవంగా జరిపారు.

**ఆకట్టుకున్న భక్తి భజనలు...**

ఈ సందర్భంగా ఖమ్మం 60వ డివిజన్ రామన్నపేట అయ్యప్ప భక్త బృందం సభ్యులు ఆలపించిన భక్తి గీతాలు, మంగళ హారతులు భక్తులను విశేషంగా అలరించాయి. 'స్వామియే శరణం అయ్యప్ప' నినాదాలతో పరిసర ప్రాంతాలన్నీ ఆధ్యాత్మిక శోభను సంతరించు కున్నాయి.

**పెద్ద సంఖ్యలో పాల్గొన్న స్వాములు..**

ఈ ఆధ్యాత్మిక మహోత్సవంలో గురు స్వాములు గరిడేపల్లి వెంకటేశ్వర్లు, చింతకాయల అంజయ్య, బరిగల శేఖర్, కట్ల నరసింహారావు, ఐతనబోయిన వెంకట్రావు, లక్ష్మణ్, కూచిపూడి మురళి, వీరబాబు, నాగరాజు, బండి మనోజ్, ఏటూకూరి నవీన్, తీగల కృష్ణ, కె. నరసింహారావు, మానుకొండ వెంకటేశ్వర రావు, ఆడపా ఆంజనేయులు, మడికంటి శ్రీను, వీరా నారాయణ, పెద్ద సంఖ్యలో అయ్యప్ప స్వాములు, గ్రామస్థులు పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.

# 29వ వార్డులో అభివృద్ధి పనులకు శ్రీకారం

**○మంత్రి పొంగులేటి చొరవతో శ్రీరామ్‌నగర్‌లో సీసీ రోడ్ల నిర్మాణం ప్రారంభం**

**ఖమ్మం రూరల్, అక్టోబర్ 26 (జనంసాక్షి):**
ఎదులాపురం మున్సిపాలిటీలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తూ అభివృద్ధి పనులు ముందుకు సాగుతున్నాయి. భాగంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహకారంతో వరంగల్ క్రాస్ రోడ్డు సమీపంలోని 29వ వార్డు శ్రీరామ్‌నగర్‌లో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు సోమవారం శ్రీకారం చుట్టారు. రహదారుల అభివృద్ధితో స్థానికుల రాకపోకలకు ఇబ్బందులు తొలగి, మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. 29వ వార్డు కౌన్సిలర్ వెంపటి ఉమా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ పనులను మున్సిపాలిటీ బీసీ సెల్ అధ్యక్షుడు వెంపటి రవి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.

**ప్రతి వార్డులో మౌలిక వసతుల కల్పన**

ఏదులాపురం మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తున్నారని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా రహదారులు, డ్రైనేజీలు తదితర మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. శ్రీరామ్‌నగర్‌లో సీసీ రోడ్ల నిర్మాణానికి సహకరించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి, మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్‌రెడ్డికి కౌన్సిలర్ వెంపటి ఉమా వెంకటేశ్వర్లు కృతజ్ఞతలు తెలిపారు. తమ ప్రాంతంలో అభివృద్ధి పనులు ప్రారంభం కావడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ హుస్సేన్, 29వ వార్డు అధ్యక్షుడు మిర్యాల నరుణ్ తేజ్, 32వ వార్డు అధ్యక్షుడు రామశెట్టి రమేష్, 28వ వార్డు కార్యదర్శి సుంకర రమేష్, కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# ఉద్యమకారుల అరెస్టులు ప్రజాస్వామ్యానికి మచ్చ: డా. కె.వి. కృష్ణారావు

**ఖమ్మం కార్పొరేషన్ అక్టోబర్ 26 (జనంసాక్షి)**

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగాలకు సైతం వెనుకాడని ఉద్యమకారులను హౌస్ అరెస్టులు చేయడం ప్రజాస్వామ్యానికి మచ్చని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి డా. కె.వి. కృష్ణారావు పేర్కొన్నారు . ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా అక్రమ అరెస్టులు, తప్పుడు కేసులతో భయభ్రాంతులకు గురిచేయడం వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని అన్నారు . ఎన్నికల ముందు ఉద్యమకారులకు ఇచ్చిన హామీలపై ఈ నెల 26వ తేదీలోపు ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కమిటీ డిమాండ్ పిలుపు మేరకు సీఎం ఇంటి ముట్టడి నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర మొత్తం మీద ఉద్యమకారులను పోలీసులు ఎక్కడికక్కడ హౌస్ అరెస్టులు , అరెస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను తక్షణమే వేగవంతం చేసి , పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా రాస్తారోకోలు , ధర్నాలు , ఆందోళనలు చేపట్టి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పగడాల నరేందర్ , లింగానబోయిన సతీష్ , డో కుపర్తి సుబ్బారావు , రెడ్డబోయిన వరలక్ష్మి , కామని అనంత లక్ష్మి , స్వరూప రెడ్డి , కమలమ్మ , ధన లక్ష్మీ , యాక లక్ష్మి తదితరులు ఉన్నారు.



# రైతులకు పరిహారం చెల్లించాకే పనులు చేపట్టాలి: సిపిఎం

## కరకట్టపై స్పష్టత ఇవ్వాలని ఎమ్మెల్యే పాయంకు వినతిపత్రం

**బూర్గంపహాడ్ అక్టోబర్ 26 (జనంసాక్షి)**

బూర్గంపహాడ్ మండలం లో పోలవరం ప్రాజెక్టు పూర్తయితే గోదావరి వరదలతో ముంపు ప్రమాదం పొంచి ఉన్న నేపథ్యంలో, కరకట్ట నిర్మాణంపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలని కోరుతూ పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వరరావుకు సీపీఎం బూర్గంపహాడ్ మండల కమిటీ నాయకులు వినతిపత్రం అందజేశారు. కరకట్ట సర్వే వివరాలను గ్రామసభల్లో వెల్లడించి, ప్రజలకు అవగాహన కల్పించాలని డిమాండ్ చేశారు. కరకట్ట నిర్మాణంతో ఎంతమంది రైతులు భూములు కోల్పోతున్నారు, కరకట్ట ఎక్కడి నుంచి ఎక్కడి వరకు నిర్మిస్తారు, ఏయే గ్రామాలకు ముంపు ప్రమాదం ఉందనే వివరాలను స్పష్టంగా ప్రకటించాలని సీపీఎం మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు కోరారు. అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం నిర్వహించి, గ్రామసభల ద్వారా ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. సోంపల్లి, బుడ్డగూడెం గ్రామాలకు ముప్పు ఉందా లేదా అనే విషయాన్ని కూడా ప్రభుత్వం స్పష్టం చేయాలన్నారు. బూర్గంపాడులోని పాండవుల బస్తీ, అంబేద్కర్ నగర్, గొల్లబజార్, ముతరాజుల ప్రాంతాలు బ్యాక్‌వాటర్ ప్రభావంతో ముంపునకు గురయ్యే ప్రమాదంపై వివరణ ఇవ్వాలని కోరారు. కరకట్ట నిర్మాణం వల్ల భూములు కోల్పోయే రైతులకు తక్షణమే పరిహార ప్యాకేజీ అందించిన తర్వాతే పనులు చేపట్టాలని సీపీఎం మండల కమిటీ డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో రాయల వెంకటేశ్వర్లు, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



# ప్రజల ప్రాణాలు పోతేనే అధికారులకు చలనం వస్తుందా?

**○అబ్బుగూడెం-కట్టుగూడెం రహదారి దుస్థితిపై బీజేపీ ఆగ్రహం**

**○ఎదుళ్ల వాగుపై హై లెవల్ బ్రిడ్జి నిర్మించాలని కలెక్టర్‌కు వినతి**

**అన్నపురెడ్డిపల్లి అక్టోబర్ 26 (జనంసాక్షి)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలంలోని అబ్బుగూడెం కట్టుగూడెం రహదారి దుస్థితిపై బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎదుళ్ల వాగు వద్ద దెబ్బతిన్న లో లెవల్ కాజ్‌వే కారణంగా ప్రజలు ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రజలకు ప్రాణనష్టం జరగకముందే సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు.

**ఏళ్లుగా ఇదే దుస్థితి.. పట్టించుకోని అధికారులు!**

అబ్బుగూడెం?కట్టుగూడెం ప్రధాన రహదారిపై ఉన్న ఎదుళ్ల వాగు లో లెవల్ కాజ్‌వే దెబ్బతిని ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులు చేపట్టకపోవడంపై బీజేపీ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. రహదారిపై భారీ గుంతలు, పగుళ్లు ఏర్పడటంతో పాటు ప్రమాద సూచిక బోర్డులు, రక్షణ గోడలు లేకపోవడం ప్రయాణికులకు ముప్పుగా మారిందని పేర్కొన్నారు. ఈ మార్గంలో ప్రయాణించే విద్యార్థులు, రైతులు, అత్యవసర వైద్య సేవల కోసం వెళ్లే రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమస్యపై పత్రికల్లో పలుమార్లు కథనాలు ప్రచురితమైనా అధికారుల్లో స్పందన లేకపోవడం విచారకరమని విమర్శించారు.

**ప్రజా సమస్యపై బీజేపీ పోరుబాట**

స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని బీజేపీ జిల్లా ఎస్టీ మోర్చా ప్రధాన కార్యదర్శి మొగిలి రామ కృష్ణ, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు బన్నె శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నాయకులు ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ప్రమాదకరంగా మారిన రహదారిపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఒక ప్రాణం పోయాకే అధికారులు స్పందిస్తారా? అని ప్రశ్నిస్తూ, ప్రజల భద్రత విషయంలో నిర్లక్ష్యం తగదని స్పష్టం చేశారు.

**బీజేపీ ప్రధాన డిమాండ్లు ఇవే..**

ఎదుళ్ల వాగుపై ప్రమాదకరంగా ఉన్న లో లెవల్ కాజ్‌వే స్థానంలో హై లెవల్ బ్రిడ్జి నిర్మించాలి.
రహదారిపై ఏర్పడిన భారీ గుంతలను పూడ్చి శాశ్వత మరమ్మతులు చేపట్టాలి.
ప్రయాణికుల భద్రత కోసం రక్షణ గోడలు, ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి.
కేవలం హామీలతో సరిపెట్టకుండా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, పనులను తక్షణమే ప్రారంభించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణాలకు భరోసా కల్పించేలా జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించాలని కోరారు.



# ఖమ్మంలో బీసీ రాజ్యాధికార పాదయాత్రను విజయవంతం చేయాలి

### తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా కమిటీ పిలుపు

**ఖమ్మం, అక్టోబర్ 26, (జనంసాక్షి) :** తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు తీన్మార్ మల్లన్న ఆదేశాల మేరకు... ఖమ్మం జిల్లాలో పార్టీ జిల్లా సోమవారం కమిటీ అత్యవసర సమావేశం నిర్వహించింది. వచ్చే నెలలో ఖమ్మం జిల్లాలో తీన్మార్ మల్లన్న చేపట్టనున్న బీసీ రాజ్యాధికార పాదయాత్రను విజయవంతం చేయడమే లక్ష్యంగా.. సమావేశంలో చర్చించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ సమావేశానికి ఉమ్మడి ఖమ్మం జిల్లా పార్టీ ఇంచార్జ్ గట్ల రాజన్న, సోషల్ మీడియా కన్వీనర్ ముక్కంటి సాయి చరణ్, తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు దామళ్ళ సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు పెరుమాళ్ళపల్లి నాగార్జున, జిల్లా కమిటీ సభ్యులు హాజరై పాదయాత్ర నిర్వహణ, ప్రజలను సమీకరించడం, పార్టీ శ్రేణులను సమన్వయం చేయడం వంటి అంశాలపై చర్చించారు. పాదయాత్రకు సంబంధించి జిల్లా స్థాయిలో చేపట్టాల్సిన కార్యాచరణపై నాయకులు దృష్టి సారించినట్లు తెలిపారు. బీసీల రాజకీయ, సామాజిక హక్కులు మరియు రాజ్యాధికారంలో వారి భాగస్వామ్యంపై ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో పాదయాత్రను నిర్వహించనున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ అభిమానులు, కార్యకర్తలు, ముఖ్య నాయకులు సమష్టిగా కృషి చేయాలని సమావేశం ద్వారా పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లాలో పాదయాత్రకు ప్రజల మద్దతు కూడగట్టడంతో పాటు, కార్యక్రమంలో పార్టీ శ్రేణులు చురుగ్గా పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని నాయకులు సూచించినట్లు సమాచారం. పాదయాత్రకు సంబంధించిన తేదీలు, మార్గం, ఇతర కార్యక్రమాల వివరాలను పార్టీ నాయకత్వం ప్రకటించాల్సి ఉంది. రాష్ట్ర అధ్యక్షుడు తీన్మార్ మల్లన్న ఆదేశాలకు అనుగుణంగా జిల్లా కమిటీ సమన్వయంతో ముందుకు సాగుతూ, బీసీ రాజ్యాధికార పాదయాత్రను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని సమావేశంలో పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఖమ్మం జిల్లా యువజన విభాగం జనరల్ సెక్రెటరీ తిరుమలగిరి జితేందర్, ఖమ్మం టౌన్ అధ్యక్షులు, కొప్పుల రామారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పోలోజు వినయ్ కుమార్, జిల్లా యూత్ అధ్యక్షులు తెళ్ళపుట్ట జగపతి, పెద్దప్రోలు కోటేశ్వరరావు, చట్టు గోపి, పెనుగొండ ఉప్పలయ్య, రాయల సుధీర్, అదురి అజయ్ తదితరులు పాల్గొన్నారు.



# తుమ్మల చెరువును మరెళ్లపాడు లిఫ్ట్‌తో నింపాలి

### యాసంగి పంటకు సాగునీరు అందించాలని రైతులతో సీపీఎం నాయకుల సంతకాల సేకరణ

**అశ్వాపురం, అక్టోబర్ 26 (జనంసాక్షి):** తుమ్మల చెరువు ఆయకట్టు రైతులకు యాసంగి పంట సాగు కోసం సాగునీరు అందించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో రైతుల నుంచి సంతకాల సేకరణ చేపట్టారు. మరెళ్లపాడు లిఫ్ట్ ద్వారా తుమ్మల చెరువును నింపి, ఆయకట్టు రైతులకు రెండో పంటకు నీరు అందించాలని నాయకులు డిమాండ్ చేశారు. తెలంగాణ రైతు సంఘం అశ్వాపురం మండల అధ్యక్షుడు బిద్దం సమ్మిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం రామ చంద్రపురం, సత్యనారాయణపురం, మల్లెల మడుగు, మొండికుంట గ్రామాల్లో రైతుల నుంచి సంతకాలు సేకరించారు. రైతుల సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని సంబంధిత అధికారులు, ప్రభుత్వం స్పందించి తుమ్మల చెరువును మరెళ్లపాడు లిఫ్ట్ ద్వారా నింపేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం లో సీపీఎం నాయకులు దండి రాములు, పగడాల అశోక్‌రెడ్డి, తునికెసి సుధాకర్‌రెడ్డి, స్వర్గం వీరరాఘవులు, ఆవుల సుధాకర్, బొమ్మరాతి రామయ్య, గొడుగు వెంకన్న, తూము వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



# భద్రాచలంలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

### ఒక దుకాణం సీజ్.. మూడు హోటళ్లకు నోటీసులు

**భద్రాచలం అక్టోబర్ 26 (జనంసాక్షి)** భద్రాచలం పట్టణంలోని వివిధ హోటళ్లు, ఆహార విక్రయ కేంద్రాల్లో ఫుడ్ సేఫ్టీ అధికారి ఈ. శరత్ తన బృందంతో సోమవారం తనిఖీలు నిర్వహించారు. నిబంధనల ఉల్లంఘనలను గుర్తించి ఒక దుకాణాన్ని సీజ్ చేయడంతో పాటు, మూడు హోటళ్లకు మెరుగుదల నోటీసులు జారీ చేశారు. తనిఖీల్లో భాగంగా ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రత, నిల్వ విధానాలు, ఆహార భద్రతా ప్రమాణాల అమలును పరిశీలించారు. నిబంధనలు ఉల్లంఘించిన ఒక దుకాణం కార్యకలాపాలను తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు నిలిపివేయాలని ఆదేశిస్తూ నోటీసు జారీ చేశారు. పరిశుభ్రత లోపాలు, ఇతర నిబంధనల ఉల్లంఘనలు గుర్తించిన మూడు హోటళ్ల యాజమాన్యాలు నిర్దేశిత గడువులోగా లోపాలను సరిదిద్దుకోవాలని సూచించారు. అలాగే, వివిధ ఆహార పదార్థాలకు సంబంధించి ఏడు నమూనాలను సేకరించి ప్రయోగశాల పరీక్షల కోసం పంపేందుకు చర్యలు చేపట్టారు. ఆహార వ్యాపారులు తప్పనిసరిగా భద్రతా ప్రమాణాలను పాటిస్తూ, పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలని, వినియోగదారులకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఫుడ్ సేఫ్టీ అధికారి ఈ. శరత్ సూచించారు. ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.

## వి బి జి రామ్ జి పనులు ప్రారంభం

కనగల్లు, అక్టోబర్ 26 (జనం సాక్షి) వి బి జి రాంజీ పథకంలో భాగంగా మండలంలోని 31 గ్రామ పంచాయతీలలో సోమవారం కూలీలతో కలిసి పనులను అధికారులు ప్రారంభించారు. ఈ పనులలో ముఖ్యంగా నీటి సౌకర్యకై నీటి కుంటలు, ఇంకుడు గుంతలు, రోడ్ల కిరువైపుల చెట్ల తొలగింపు, వరద కాలువలలో పూడికల తీత, చెరువు పనులు , వ్యవసాయ ఆధారిత పనులను గుర్తించి కూలీలకు పనులు కల్పించే విధంగా చర్యలు తీసుకున్నట్లు ఈ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీవో బిసుధాకర్ కోరారు.



## పాల్వాయిలో అనుమతులు లేని అక్రమ వెంచర్లపై విచారణ జరపాలి : ఎంఆర్‌ఓకు ఫిర్యాదు

**గుర్రంపోడు అక్టోబర్ 26 (జనంసాక్షి)** గుర్రంపోడు మండల పరిధిలోని పాల్వాయి గ్రామం గుడిపల్లి ఎక్స్ రోడ్ వద్ద సర్వే నంబర్ 163/3లో ఎలాంటి గ్రామపంచాయతీ మరియు సంబంధిత శాఖల అనుమతులు లేకుండా అక్రమంగా వెంచర్ ఏర్పాటు చేసి ప్లాట్ల విక్రయాలు జరుపుతున్నారని పాల్వాయి గ్రామ నివాసి నల్ల నందుబాబు ఆరోపించారు. ఈ విషయమై సోమవారం ఆయన గుర్రంపోడు మండల రెవెన్యూ అధికారి ఎమ్మార్వో రాతపూర్వక ఫిర్యాదు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సదరు వెంచర్‌లో కనీస మౌలిక సదుపాయాలైన రోడ్లు, డ్రైనేజీ వంటి వసతులు కల్పించకుండా, నిబంధనలకు విరుద్ధంగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్లాట్లను విక్రయిస్తూ అమాయక ప్రజల నుండి భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అనుమతులు లేని ఇలాంటి వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసి భవిష్యత్తులో ప్రజలు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి, క్షేత్రస్థాయి పరిశీలన జరిపి, రికార్డులను తనిఖీ చేయాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించిన బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రజలు మోసపోకుండా చూడాలని ఆయన అధికారులను విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పర్వత రెడ్డి, కరుణాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# శబరి భక్తికి భద్రగిరిలో భక్తజన నీరాజనం

- వన రామయ్యకు ఫలపుష్ప సమర్పణ..
- గిరిజన సంప్రదాయాలతో శబరి స్మృతి యాత్ర వైభవం..

**భద్రాచలం అక్టోబర్ 26 (జనంసాక్షి)** శబరి మాత నిష్కల్మష భక్తిని స్మరిస్తూ భద్రగిరిలో సోమవారం నిర్వహించిన 13వ శబరి స్మృతి యాత్ర భక్తిభావంతో వైభవంగా సాగింది. వేలాదిగా తరలివచ్చిన గిరిజన భక్తులు సంప్రదాయ నృత్యాలు, కోలాటాలతో భద్రగిరి ప్రదక్షిణ నిర్వహించి, పూలు, పండ్లతో వన రామయ్యకు భక్తి నీరాజనాలు అర్పించారు. భద్రాద్రి శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ యాత్రలో రామలక్ష్మణులు, శబరి చిత్రపటాలను ముందుంచి గిరిజనులు మేళతాళాల నడుమ భక్తిశ్రద్ధలతో ప్రదక్షిణ చేశారు. అనంతరం శ్రీరామ సేవా మండపంలో పుష్పాలు, ఫలాలు, పత్రాలను స్వామివారికి సమర్పించారు. వెలగ, రేగు, అరటి, నారింజ, బత్తాయి, దానిమ్మ, ద్రాక్ష, యాపిల్, సీతాఫలాలతో పాటు గులాబీ, చామంతి, కనకాంబరం, మల్లె తదితర పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీరామ షడాక్షర సంపుటిత విశేష రామనామార్చన అనంతరం అర్చకులు పుష్పార్చన చేసి, ఫలాలను నివేదించి హారతులు సమర్పించారు. భక్తులకు ప్రత్యేక లడ్డూ ప్రసాదంతో పాటు పూజల్లో వినియోగించిన పుష్పాలు, ప్రసాదాలను అందజేశారు. దేవస్థానం తరఫున 15 మంది గిరిజన దంపతులకు నూతన వస్త్రాలను, గిరిజన ముత్తైదువులకు సారెను ఈవో కె.దామోదరరావు అందజేశారు. యాత్రకు వచ్చిన గిరిజన భక్తులకు ఉచిత వసతి, భోజన సదుపాయాలు కల్పించడంతో పాటు ప్రత్యేక బస్సుల ద్వారా వారిని స్వస్థలాలకు చేర్చే ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, దేవస్థానం ఈవో కె.దామోదరరావు, ఏఈవోలు శ్రావణ్‌కుమార్, భవానీరామకృష్ణారావు, పర్యవేక్షకులు లింగాల సాయిబాబా, కత్తి శ్రీనివాస్, స్థానాచార్యులు కేఈ స్థలశాయి, ప్రధాన అర్చకులు అమరవాది విజయరాఘవన్, వైదిక, పరిపాలన సిబ్బంది పాల్గొన్నారు.



**కూనవరంలో శబరి మాతకు ప్రత్యేక పూజలు**

ఆంధ్రప్రదేశ్‌లోని గోదావరి, శబరి నదుల సంగమ ప్రాంతమైన కూనవరంలోనూ శబరి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భద్రాద్రి దేవస్థానం ముఖ్య అర్చకులు పొడిచేటి రామభద్రాచార్యులు శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకం చేశారు. పాలు, పెరుగు, తేనె, నెయ్యి తదితర ద్రవ్యాలతో అభిషేకించి ప్రత్యేక పూజలు సమర్పించారు. శబరి మాత నిష్కల్మష భక్తిని చాటిన ఈ యాత్ర గిరిజనుల ఆధ్యాత్మిక ఐక్యతకు ప్రతీకగా నిలిచింది.



# అర్హులైన గిరిజనులకు సంక్షేమ పథకాలు అందేలా చర్యలు

- గిరిజన దర్బార్‌లో వచ్చిన అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తాం..
- ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్ రాజ్..



**భద్రాచలం అక్టోబర్ 26 (జనంసాక్షి)**
గిరిజన దర్బార్‌లో అర్జీలు సమర్పించిన అర్హులైన గిరిజన కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్ తెలిపారు. గిరిజనులు తమ జీవనోపాధికి సంబంధించిన అవసరాలను లిఖితపూర్వకంగా తెలియజేస్తే, సంబంధిత శాఖల అధికారుల ద్వారా అర్హులకు పథకాలు అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. సోమవారం భద్రాచలం లోని ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో వివిధ ఆదివాసీ గ్రామాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అధికారిక పనుల నిమిత్తం అందుబాటులో లేకపోవడంతో ఎస్‌డీసీ ఆనందకుమార్, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు చందన, గురుకులాల ఆర్‌సీఓ అరుణకుమారి, ఏడీఎంహెచ్‌వో సైదులుతో కలిసి అర్జీలను పరిశీలించారు. తన పరిధిలోని సమస్యలను వెంటనే పరిష్కరించి, మిగిలిన వాటిని సంబంధిత అధికారులకు పంపాలని సూచించారు. ఈ సందర్భంగా పోడు భూముల పట్టాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం, పట్టాల్లో పేర్ల మార్పులు, భూ సమస్యల పరిష్కారం, నూతన చేపల సొసైటీల ఏర్పాటు, స్వయం ఉపాధి శిక్షణ, వ్యవసాయానికి విద్యుత్ కనెక్షన్లు, బోర్లు, మోటారు రుణాలు, గిరిజన గ్రామాల్లో త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పించడం వంటి అంశాలపై అర్జీలు అందాయి. దీర్ఘకాలిక వ్యాధుల చికిత్సకు ఆర్థిక సాయం, సౌర విద్యుత్ ద్వారా పంట పొలాలకు విద్యుత్ కనెక్షన్లు, ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్ఎంగా పనిచేసేందుకు ఉద్యోగ భృతి, ఇతర ఆర్థిక ప్రయోజనాల కోసం గిరిజనులు వినతులు సమర్పించారు. గిరిజన దర్బార్‌లో అందిన అర్జీలన్నింటినీ ఆన్‌లైన్‌లో నమోదు చేసి, అర్హులైన వారికి విడతలవారీగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని డేవిడ్ రాజ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి ఉదయ్‌కుమార్, ఏపీవో పవర్ వేణు, ఏవో సున్నం రాంబాబు, మేనేజర్ ఆదినారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనసూయ, వివిధ శాఖల సిబ్బంది స్వాతి, విజయ్, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.




## విద్యా నైపుణ్యాల్లో ప్రతిభ చూపిన
# విద్యార్థినులకు ప్రశంసా పత్రాలు

- విద్యార్థినులను అభినందించిన సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ

**భద్రాచలం అక్టోబర్ 26 (జనంసాక్షి)**
దుమ్ముగూడెంలోని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థినులు విద్యా నైపుణ్యాల్లో ప్రతిభ కనబరిచి మంచి ర్యాంకులు సాధించడం అభినందనీయమని భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ అన్నారు. సోమవారం తన కార్యాలయంలో ప్రతిభావంతులైన విద్యార్థినులకు ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు.కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న పి. ప్రవల్లిక (ఎంపీసీ), కె. రేవతి (బైపీసీ), ఎం. నందిని (సీఈసీ) తమ విద్యా నైపుణ్యాలతో ప్రతిభ కనబరిచి అత్యుత్తమ ర్యాంకులు సాధించినందుకు వారిని ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థినులకు స్కాలర్‌షిప్ అవకాశాలను గుర్తించి, దరఖాస్తు చేసుకునేలా సహకరించాలని కళాశాల ప్రిన్సిపాల్‌కు సూచించారు. ప్రతిభావంతులైన విద్యార్థినులను స్ఫూర్తిగా తీసుకుని ఇతర విద్యార్థులు కూడా ఉన్నత ర్యాంకులు సాధించి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. గతంలో ఐటీసీ సహకారంతో కళాశాలలో నీట్, జేఈఈ పరీక్షల సన్నద్ధత కోసం కంప్యూటర్ ల్యాబ్, మినీ లైబ్రరీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ స్వర్ణలత, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎక్సైజ్ వాహనాల వేలంతో
# రూ.1.42 లక్షల అదనపు ఆదాయం

**భద్రాచలం అక్టోబర్ 26 (జనంసాక్షి)**
భద్రాచలం ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాల వేలం ద్వారా ప్రభుత్వానికి రూ.1.42 లక్షల అదనపు ఆదాయం సమకూరింది. సోమవారం అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సమక్షంలో నిర్వహించిన ఈ వేలంలో మొత్తం 34 వాహనాలను విక్రయానికి ఉంచగా, 31 వాహనాలు అమ్ముడయ్యాయి. ఈ వాహనాలకు రూ.1,61,900 ప్రారంభ ధర నిర్ణయించగా, వేలం ద్వారా రూ.3,04,000 ఆదాయం లభించింది. దీంతో నిర్ణీత ప్రారంభ ధర కంటే రూ.1,42,100 అదనంగా సమకూరినట్లు భద్రాచలం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ బి. కిష్టయ్య వెల్లడించారు.

# దోరేపల్లిలో ఎమ్మెల్సీ ఓట్ల నమోదు ప్రక్రియ ప్రారంభం

**కనగల్లు, అక్టోబర్ 26 (జనం సాక్షి)**
వరంగల్ ఖమ్మం నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల నమోదు ప్రక్రియ సోమవారం దోరేపల్లి గ్రామంలో బిజెపి ఆధ్వర్యంలో ప్రారంభించారు. పార్టీ నాయకులు గడప గడప తిరుగుతూ పట్టభద్రులను గుర్తించి ఇంటి వద్దనే ఫారం 18 లో ఓటర్ల పూర్తి వివరాలను పూరించి ఆన్లైన్లో నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీజిల్లా కార్యవర్గ సభ్యులు దాసరి వెంకన్న, కిసాన్ మోర్చా జిల్లా కౌన్సిల్ సభ్యులు మాధగోని ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



## హత్య, అత్యాచారం కేసులో
# నిందితుడికి జీవిత ఖైదు

**వలిగొండ, అక్టోబర్ 26(జనం సాక్షి)**
మండల పోలీస్ స్టేషన్ పరిధిలో 2020లో నమోదైన హత్య, అత్యాచారం కేసులో నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ నల్గొండలోని ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక న్యాయస్థానం సోమవారం వెల్లడించింది. మండలంలోని గోల్నేపల్లి గ్రామానికి చెందిన చిన్నపాక రవితేజకు హత్య కేసులో జీవిత ఖైదుతో పాటు రూ.5 వేల జరిమానా విధించింది. అత్యాచారం కేసులో ఏడేళ్ల జైలు శిక్ష, రూ.1,000 జరిమానా విధించగా, సాక్ష్యాధారాల ధ్వంసం, దొంగతనం కేసుల్లో ఒక్కొక్కటి మూడేళ్ల జైలు శిక్ష, రూ.1,000 చొప్పున జరిమానా విధించింది.ఈ కేసులో అప్పటి దర్యాప్తు అధికారి రిటైర్డ్ ఏసీపీ భుజంగరావు, ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ దర్శనం నర్సింహ, కోర్టు డ్యూటీ అధికారి ఏ. రాము, సమన్ల అమలులో సహకరించిన టీ. మహేశ్ ప్రాసిక్యూషన్ తరఫున కీలకంగా వ్యవహరించారు. కేసు విచారణలో సహకరించి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బంది, న్యాయవాదులను జిల్లా ఎస్పీ అక్షయ్ యాదవ్ ఐపీఎస్ అభినందించారు.

# గుత్తి కోయ కుటుంబాలకు జాబ్ కార్డులు మంజూరు







**టేకులపల్లి,అక్టోబర్ 26(జనంసాక్షి):**
టేకులపల్లి మండలంలో రెండు గ్రామాలలో నివసిస్తున్న గుత్తి కుటుంబాలకు వి బి జి రామ్ జి ఉపాధి హామీ పథకం జాబ్ కార్డులను జిల్లా అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి నల్లమోతు రవికుమార్ సోమవారం వారి గ్రామాలను సందర్శించి మంజూరు చేసి అందజేశారు. తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆదివాసి గుత్తి కోయ గ్రామాలైన టేకులపల్లి మండలం గంగారం గ్రామపంచాయతీ పరిధిలోని సిద్దారం, చింతోని చిలక గ్రామపంచాయతీ పరిధి లోని సర్వాయి బోడు గ్రామాలలో నివసిస్తున్న 15 కుటుంబాలతో సమావేశమై ప్రతి ఒక్కరూ ఉపాధి హామీ పనిని సద్వినియోగం చేసుకోవాలని, ఒక్కొక్క కుటుంబ సభ్యులు 125 రోజులు పని చేయాలని, పని కొలతల ప్రకారం రోజుకు రు. 308 రూపాయల చొప్పున రు. 38500 లను పొందవచ్చునని అవగాహన కల్పించారు. ఈ రెండు గ్రామాలలో నివసిస్తున్న జాబ్ కార్డు లేని గుత్తి కోయ 15 కుటుంబాల వారికి దరఖాస్తులు తీసుకొని వారికి కార్డులు మంజూరు వెంటనే మంజూరు చేశారు. సొంత, ఇతర భూములలో ఫారం పాండు, చెరువు పూడిక తీత పనులు ఇంకుడు గుంతలు ఇంకా 375 రకాల పనులను సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందాలని తెలిపారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి మరుగుదొడ్డి, ఇంకుడు గుంతల నిర్మాణం ఖచ్చితం గా చేపట్టాలని గ్రామస్తులను సూచించారు. రాబోయే రోజులలో లెనినో కరువు ప్రభావం తీవ్రతరం ఉండ బోతున్న వనరులను జాగ్రత్తగా వాడుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గంగారం గ్రామపంచా యతీ సర్పంచ్ ఇర్ప రుక్మిణి, ఉప సర్పంచ్ కోర్స చుక్కమ్మ, చింతోనిచలక సర్పంచ్ మెట్ల తులసమ్మ, డి ఆర్ డి ఏ కార్యాలయ ఏపీడీ లు విజయ భాస్కర్ రెడ్డి, రమణ, రాజు, ఏపీవో కాళంగి శ్రీనివాస్, ఈసీ తిరుపతయ్య , కార్యదర్శులు సునీల్ కుమార్, అనిల్ కుమార్, టెక్నికల్ అసిస్టెంట్ రమణ, ఫీల్డ్ అసిస్టెంట్ సరిత పాల్గొన్నారు.

# దళారులకు ధాన్యం విక్రయించొద్దు
## ఏవో వెంకటేశ్వర్లు

**పినపాక, అక్టోబర్ 26(జనంసాక్షి):**
వానాకాలం 2026లో వరి సాగు చేసిన రైతులు తాము పండించిన ధాన్యాన్ని దళారులకు తక్కువ ధరలకు విక్రయించి నష్టపోవద్దని పినపాక మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు సూచించారు. రైతులు ధాన్యం పూర్తిగా పక్వానికి వచ్చిన తర్వాతే కోతలు చేపట్టి, ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యాన్ని సిద్ధం చేసుకోవాలని కోరారు. ధాన్యంలో తేమశాతం 17 శాతానికి మించకుండా బాగా ఆరబెట్టి, ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని సూచించారు. ప్రభుత్వం గుర్తించిన ఏడు సన్న ధాన్యం రకాలకు క్వింటాకు రూ.2,461 మద్దతు ధరతో పాటు అదనంగా రూ.500 బోనస్ అందించనున్నట్లు తెలిపారు. అలాగే దొడ్డు ధాన్యానికి క్వింటాకు రూ.2,441 మద్దతు ధర లభిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధర, బోనస్ ప్రయోజనాలను రైతులు పూర్తిస్థాయిలో పొందాలని సూచించారు. ఎవరైనా వ్యాపారులు లేదా దళారులు తక్కువ ధరలకు ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రయత్నిస్తే వెంటనే పినపాక తహసీల్దార్, మండల వ్యవసాయ అధికారి లేదా జిల్లా కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలని కోరారు. రైతులు దళారుల చేతిలో నష్టపోకుండా, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను వినియోగించుకొని తమ పంటకు గిట్టుబాటు ధర పొందాలని మండల వ్యవసాయ అధికారి రైతులను కోరారు.

# పట్టభద్రుల పోరుకు గులాబీ సైన్యం సన్నద్ధం

- ఖమ్మం 8వ డివిజన్‌లో జోరుగా ఎమ్మెల్సీ ఓట్ల నమోదు..
- రెండ్రోజుల్లోనే 101 ఫారాలు పూర్తి
- మాజీ మంత్రి పువ్వాడ అజయ్, బచ్చు విజయ్ దిశానిర్దేశంలో ముమ్మర ప్రచారం
- ఇంటింటికీ తిరుగుతూ గ్రాడ్యుయేట్లను కలుస్తున్న దేవభక్తుని కిషోర్ బృందం
- పార్టీ జిల్లా కార్యాలయంలో ఇన్చార్జ్ కార్తిక్‌కు ఎన్‌రోల్‌మెంట్ పత్రాల అందజేత
- నవంబర్ 6 వరకు గడువు.. అర్హులంతా నమోదు చేసుకోవాలని పిలుపు



**ఖమ్మం, (జనంసాక్షి):**
రాబోయే శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గ సమరానికి భారత్ రాష్ట్ర సమితి శ్రేణులు క్షేత్రస్థాయిలో వేగంగా పావులు కదుపుతున్నాయి. ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని 8వ డివిజన్‌లో గులాబీ దళం చేపట్టిన పట్టభద్రుల ఓట్ల నమోదు ప్రక్రియ రికార్డు స్థాయిలో దూసుకుపోతోంది. మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సమర్థవంతమైన నాయకత్వంలో, ఖానాపురం హవేలీ బీఆర్ఎస్ ఇన్‌ఛార్జ్, సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, డివిజన్ ఇన్చార్జి దేవభక్తుని కిషోర్ బాబు ఆదేశాలు, సూచనలతో స్థానిక నేతలు డివిజన్‌ను జల్లెడ పడుతున్నారు.

**రెండు రోజుల్లోనే సెంచరీ దాటిన నమోదు**
డివిజన్ పరిధిలో పకడ్బందీ ప్రణాళికతో చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా దేవభక్తుని కిషోర్ ఆధ్వర్యంలో కేవలం రెండు రోజుల్లోనే 101 గ్రాడ్యుయేట్ ఓట్ల నమోదు ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు. డివిజన్‌లోని కీలక ప్రాంతాలను విభజించుకుని నాయకులు బృందాలుగా ఏర్పడి నమోదును వేగవంతం చేశారు. గోపాలపురం, ఎల్బీ నగర్ ప్రాంతాల్లో వాంకుడోత్ సురేష్ నేతృత్వంలో క్షేత్రస్థాయిలో పర్యటించి 54 మంది పట్టభద్రుల వివరాలను సేకరించి దరఖాస్తులు చేయించారు. వైఎస్సార్ కాలనీ, బాలపేటలో కందాల వీరేందర్ గౌడ్ సారథ్యంలో 47 మంది గ్రాడ్యుయేట్లతో ఓటరు ఫారాలను పూర్తి చేయించారు. ఈ విధంగా రెండు రోజుల వ్యవధిలోనే పూర్తిచేసిన మొత్తం 101 ఎన్‌రోల్‌మెంట్ పత్రాలను ఖమ్మం? వరంగల్? నల్గొండ (మూడు జిల్లాల) పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్ రెడ్డి ఖమ్మం నియోజకవర్గ (ఖానాపురం హవేలీ) ఇన్‌ఛార్జ్ కార్తిక్ కి ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో లాంఛనంగా అందజేశారు.

**ఇల్లిల్లూ తిరుగుతూ.. యువతను చైతన్యపరుస్తూ..**
గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో 8వ డివిజన్ నుంచి ఓటు హక్కు వినియోగించుకున్న పాత పట్టభద్రులను మాత్రమే కాకుండా, 2023 నాటికి డిగ్రీ పూర్తి చేసుకున్న ప్రతి ఒక్క నవ యువ గ్రాడ్యుయేట్‌ను గుర్తించి జాబితాలో చేర్చేలా కసరత్తు చేస్తున్నారు. డివిజన్ పరిధిలోని ప్రతి బస్తీ, ప్రతి గల్లీలో ఇంటింటికీ తిరుగుతూ విద్యావంతులకు ఓటు హక్కు ప్రాధాన్యతను వివరిస్తున్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ప్రక్రియల్లో ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా సర్టిఫికెట్ల పరిశీలన, ఫారం-18 పూర్తి చేయించడంలో నాయకులు స్వయంగా సహకారం అందిస్తున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాబోయే నవంబర్ 6వ తేదీ వరకు ఈ నమోదు ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతుందని, డివిజన్‌లో ఒక్క గ్రాడ్యుయేట్ కూడా ఓటు హక్కు కోల్పోకుండా శతశాతం నమోదు చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని స్పష్టం చేశారు.

**కార్యకర్తల్లో నూతనోత్సాహం**
కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నేతలు, డివిజన్ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పార్టీ అగ్ర నాయకత్వం ఇస్తున్న పిలుపుతో కింది స్థాయి శ్రేణుల్లో ఉత్సాహం వెల్లివిరుస్తోందని నేతలు పేర్కొన్నారు. ఈ నమోదు కార్యక్రమంలో బీఆర్ఎస్ ముఖ్య నాయకులు రెంటపల్లి రమేష్, బొడ్డుపల్లి వెంకటేశ్వర్లు, వద్రనపు శ్రీనివాసరావు, రహీమ్, విజయ్, ఎస్.కె. యూసఫ్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




## మహిళా కండక్టర్ ప్రవళికపై దాడికి నిరసన

**మధిర, అక్టోబర్ 26 (జనంసాక్షి):**
మణుగూరు డిపోలో విధులు నిర్వహిస్తున్న మహిళా కండక్టర్ ప్రవళికతో చిల్లర విషయంలో గొడవపడిన ఓ మహిళా ప్రయాణికురాలు కండక్టర్ ను బస్సు డోర్ నుంచి బయటకు నెట్టివేసి దాడిని మధిర డిపో జేఏసీ తీవ్రంగా ఖండించింది. సోమవారం మధిర డిపో జేఏసీ ఆధ్వర్యంలో ఆర్టీసీ కార్మికులు డిపో గేట్ వద్ద ఆందోళన నిర్వహించారు. విధులకు హాజరైన కార్మికులందరూ మొదటి బస్సు నుంచే నల్ల బ్యాడ్జీలు ధరించి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ, విధి నిర్వహణలో ఉన్న ఆర్టీసీ కార్మికులపై దాడులను తక్షణమే అరికట్టాలని డిమాండ్ చేశారు. ప్రజలకు నిరంతరం రవాణా సేవలు అందిస్తున్న కార్మికులపై దాడులు జరగడం ఆందోళనకరమని పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళా ఉద్యోగులకు విధి నిర్వహణలో పూర్తి భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి, ఆర్టీసీ యాజమాన్యానికి ఉందని అన్నారు. మహిళా కండక్టర్ ప్రవళికపై దాడికి పాల్పడిన వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, బాధితురాలికి మెరుగైన వైద్యం అందించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన భద్రతా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తమ్మినేని రామారావు, షేక్ నాగుల్ మీరా, కోటయ్య,కిరణ్ బాబు,ఎలియాస్, ఎస్ ఎస్ రావు , సత్యనారాయణ, హరికృష్ణ, శేషయ్య, షేక్ రహీం, షేక్ ఖాసీం సాహెబ్, కోటేశ్వరరావు, గౌస్ ,శ్రీనివాసరావు, తిరుపతిరావు, కొండలరావు, రజిత, అనూష, సుజాత, లక్ష్మి ,కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల ఇంటర్ ప్రవేశాలకు గడువు పొడిగింపు

○అక్టోబర్ 29 వరకు అవకాశం..
○అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి..

**దమ్మపేట అక్టోబర్ 26 (జనంసాక్షి):**
తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలు, జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు గడువు పొడిగించినట్లు జిల్లా సమన్వయ అధికారి తెలిపారు. దమ్మపేటలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర జూనియర్ కళాశాల (TGSWRS/JC(B)) లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు అర్హులైన విద్యార్థులకు అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ ప్రవేశాల గడువును 2026 అక్టోబర్ 29 వరకు పొడిగించిన నేపథ్యంలో, ఇప్పటివరకు ప్రవేశాలు పొందని అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ప్రవేశాలకు అవసరమైన ఒరిజినల్ సర్టిఫికెట్లతో దమ్మపేటలోని గురుకుల బాలుర జూనియర్ కళాశాలను సంప్రదించాలని కోరారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని గురుకుల కళాశాలలో ప్రవేశాలు పొందాలని జిల్లా సమన్వయ అధికారి తెలిపారు.



## నీటిని, విద్యుత్తును పొదుపుగా వాడుకోవాలి

**ఎల్ నినో నేపథ్యంలో విద్యుత్ ఉద్యోగులకు చీఫ్ ఇంజనీర్ బిచ్చన్న సూచన..**

**కొత్తగూడెం క్రైమ్, అక్టోబర్26 (జనంసాక్షి):**
ఎల్ నినో వల్ల కలిగిన వర్షాభావ పరిస్థితుల్లో నీటిని,విద్యుత్ ను పొదుపుగా వాడాలని బిటిపిఎస్ చీఫ్ ఇంజనీర్ బి. బిచ్చన్న ఉద్యోగులకు సూచించారు. బీ టీ పి యస్ లో సోమవారం మహర్షి వాల్మీకి జయంతి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమం లో వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎల్ నినో నేపథ్యం ఉద్యోగులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మాట్లాడారు. వర్షాభావ పరిస్థితులను అధిగమించడానికి రాష్ట్ర ప్రభుత్వం పలు సూచనలు చేస్తుందని పేర్కొన్నారు. ఆ సూచనలు అన్నిటిని పాటించాల్సిన బాధ్యత విద్యుత్ ఉద్యోగులుగా మనకు మరింత ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. కర్మాగారంలో నీటి వృధా కాకుండా ఎప్పటికప్పుడు పైపులైను తనిఖీ చేయాలని సూచించారు. అవసరమైనప్పుడు మాత్రమే లైట్లను వినియోగించాలని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ కొరత నేపథ్యంలో బీటీపీఎస్ నుంచి ఎక్కువ విద్యుత్పత్తి చేస్తున్నామని హర్షం వ్యక్తం చేశారు. బీటీపీస్ పనితీరుపై జెన్కో ఉన్నతాధికారులు కూడా సంతృప్తి వ్యక్తం చేశారని పేర్కొన్నారు. ఉద్యోగులందరి కృషి ఫలితం గానే మెరుగైన పనితీరు కనబరిచామని అభినందించారు. ఇదే స్ఫూర్తితో ఉద్యోగులు అంకితభావంతో పని చేస్తూ సంస్థకు మంచి పేరు తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిటిపిఎస్ సూపర్డెంట్ ఇంజనీర్లు మురళీకృష్ణ, డబ్ల్యు. రమేష్ బాబు, టి. శ్రీనివాసరావు, సిహెచ్. రామ్మోహన్ పలువురు అధికారులు అసోసియేషన్, కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

## ఐటీడీఏకు కూతవేటు దూరంలోనే అభివృద్ధికి నోచుకోని చింతకుంట

- 40 మంది విద్యార్థులకు విద్య కరువు..
- కనీస సదుపాయాల కోసం ఆదివాసీల వినతి.



**భద్రాచలం అక్టోబర్ 26 (జనంసాక్షి)**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం మోతె పట్టినగర్ పంచాయతీ పరిధిలోని చింతకుంట కోయ ఆదివాసీ గ్రామం కనీస మౌలిక సదుపాయాలకు నోచుకోవడం లేదు. విద్యుత్, తాగునీరు, రహదారి, పాఠశాల, వైద్య సదుపాయాలు కల్పించాలని కోరుతూ గ్రామస్తులు ఐటీడీఏ పీవోకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో సుమారు 40 మంది విద్యార్థులకు ప్రాథమిక విద్య అందడం లేదని, పాఠశాల ఏర్పాటు చేయాలని కోరారు. శ్రీరాంపురం ఎస్టీ కాలనీ నుంచి గ్రామానికి 700 మీటర్ల మేర గ్రావెల్ రోడ్డు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. అటవీశాఖ అభ్యంతరాలతో అర్ధాంతరంగా నిలిచిపోయిన విద్యుత్ లైన్ పనులను పూర్తి చేయాలని, మిషన్ భగీరథ పైపులైన్ ద్వారా సురక్షిత తాగునీరు అందించాలని కోరారు. అత్యవసర వైద్య సేవల కోసం మినీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.



## అనాథ యువతి పెళ్లికి అండగా నిలిచిన భూక్యా అశోక్

**తండ్రిని కోల్పోయిన యువతికి పట్టుచీర, ఆర్థిక సాయం అందజేత**

**హర్షం వ్యక్తం చేసిన స్థానికులు**



**ఖమ్మం, (జనంసాక్షి) :**
పేద యువతికి బీఆర్ఎస్ నాయకులు భూక్యా అశోక్ అండగా నిలిచి పెద్ద మనసు చాటుకున్నారు. ఖమ్మం నగరంలోని 8వ డివిజన్ వైఎస్సార్ కాలనీ, రోడ్ నంబర్-5 నివాసి షేక్ ఇబ్రహీం కుమార్తె షేక్ తస్లీమ్ వివాహం ఈ నెల 29న జరగాల్సి ఉంది. అయితే, కొద్ది రోజుల క్రితం తండ్రి ఇబ్రహీం హఠాన్మరణం చెందడంతో ఆ కుటుంబం తీవ్ర విషాదం. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు భూక్యా అశోక్ తక్షణమే స్పందించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి, తస్లీమ్‌ను తన సొంత చెల్లెలిగా భావిస్తూ వివాహానికి అవసరమైన పట్టుచీరతో పాటు నగదును ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "నీకు ఒక అన్నగా జీవితాంతం అండగా ఉంటాను. ఎలాంటి కష్టం వచ్చినా ధైర్యంగా ఉండు, నా సహకారం ఎల్లప్పుడూ ఉంటుంది" అని వధువుకు కొండంత భరోసా కల్పించారు. కష్టకాలంలో స్పందించి మానవతా దృక్పథంతో ఆర్థిక చేయూతనందించిన భూక్యా అశోక్‌ను వైఎస్సార్ కాలనీ ప్రజలు, స్థానికులు మనస్ఫూర్తిగా అభినందించారు.

# ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన అదనపు కలెక్టర్ శ్రీజ



**ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్ 26(జనంసాక్షి)**
ప్రతి ఫిర్యాదు దరఖాస్తును పరిశీలించి చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రజల అర్జీలను స్వీకరించారు. వేంసూరు మండలానికి చెందిన డి.అపర్ణ తనకు దివ్యాంగుల పెన్షన్ వస్తుందని, తనకు బ్రతకడం చాలా కష్టంగా ఉందని మాల ఎస్సీ కులానికి చెందిన తాను ఇంటర్ ఉత్తీర్ణత సాధించానని, ఏదైనా ఉపాధి కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా ఉపాధి అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఖమ్మం నగరానికి చెందిన మహమ్మద్ అబ్దుల్ కరీం తాను టీ హబ్ దయాగ్నస్టిక్ సెంటర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నందు ఔట్ సోర్సింగ్ లో ల్యాబ్ టెక్నీషియన్ గా విధులు నిర్వహించానని, జనవరి 2024 లో టర్మినేట్ చేశారని, తనకు ఉపాధి కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి పరిశీలించి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఖమ్మం నగరానికి చెందిన ఎస్.కే. నస్రీన్ తాను ట్రాన్స్ జెండర్ మహిళగా తనకు ఔట్సోర్సింగ్ ఉద్యోగం కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా ప్రభుత్వ వైద కళాశాల ప్రిన్సిపాల్ కు రాస్తూ పరిశీలించి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఖమ్మం వైయస్సార్ కాలనీ కు చెందిన ఎం. రోజా తన భర్త తాగుతూ తనను హింసకు గురి చేస్తున్నారని తనకు రక్షణ కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా సంక్షేమ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు వెంటనే తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## అసిస్టెంట్ కమిషనర్ కు వినతిపత్రం

**ఖమ్మం కార్పొరేషన్ అక్టోబర్ 26(జనంసాక్షి)**
ఖమ్మం నగరంలోని వివిధ పార్కుల్లో ,రోడ్డు డివైడర్స్ లో పట్టణ ప్రజలకు పచ్చదనం అందిస్తున్న కార్మికులకు సకాలంలో వేతనాలు ఇవ్వకుండా కాంట్రాక్టర్లు తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని వారు ఆరోపించారు సుమారు 25 మంది కార్మికులకు గత రెండు నెలల నుండి జీతాలు ఇవ్వకపోవడం వల్ల పండుగ రోజు పస్తులు ఉండ వలసిన పరిస్థితి ఏర్పడ్డది అని టియుసిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి జి రామయ్య ఆవేదన వ్యక్తం చేశారు , నగరంలో పనిచేస్తున్నటువంటి కార్మికులకు వేతనాలు ఇవ్వాలని ఈరోజు ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ అనిల్ సార్ కు టి యు సి ఐ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజలకు అల్లాదకరమైనటువంటి వాతావరణన్ని కల్పిస్తున్నటువంటి కార్మికులకు వేతనాలు లేక పస్తులు ఉన్న పరిస్థితి ఉన్నది కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లనే వాళ్లకు వేతనాలు ఇవ్వడం లేదు తక్షణమే అధికారులు స్పందించి వేతనాలు ఇవ్వాలని అధికారులను డిమాండ్ చేయడం జరిగింది. స్పందించిన కమిషనర్ కాంట్రాక్టర్ ఫోన్ ద్వారా మాట్లాడి మూడు రోజుల్లో వేతనాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ వినతిపత్ర కార్యక్రమంలో టియుసిఐ ఖమ్మం నగర కార్యదర్శి కే శ్రీనివాస్ నాయకులు కుమారి వీరభద్రం కల్పన స్వప్న కావ్య రేణుక బుచ్చయ్య గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## బీటీపీఎస్ గేటు సమీపంలో రోడ్డుపై కూలిన వృక్షం

### తక్షణమే తొలగించిన సర్పంచ్ అనిత

**పినపాక, అక్టోబర్ 26(జనంసాక్షి):**
మండలంలోని సీతారాంపురం గ్రామపంచాయతీ పరిధిలోని బీటీపీఎస్ గేటు దాటిన తర్వాత ప్రధాన రహదారిపై వృక్షం కూలిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ సనప అనిత, పోలీస్ శాఖ అధికారులు తక్షణమే స్పందించి జేసీబీ సహాయంతో కూలిన చెట్టును తొలగించారు. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం తొలగి, ట్రాఫిక్ యథావిధిగా కొనసాగింది. తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించిన సర్పంచ్ అనితపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ ఉపేందర్, ఉప సర్పంచ్ వెంకటేశ్వర్లు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.





## ఎల్‌నినోపై అప్రమత్తత అవసరం

### కెప్టెన్ బంజర సర్పంచ్ ఆరెం అచ్చమ్మ

**కామేపల్లి, అక్టోబర్ 26 (జనంసాక్షి):**
వాతావరణంలో సంభవిస్తున్న ఆకస్మిక మార్పులు, ఎల్‌నినో ప్రభావం పట్ల గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కెప్టెన్ బంజర సర్పంచ్ ఆరెం అచ్చమ్మ పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లా కామేపల్లి మండల పరిధిలోని కెప్టెన్ బంజర గ్రామంలో సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామస్థాయి ప్రత్యేక అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో తీవ్ర ఎండలు, వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాస్తిపల్లి రెవెన్యూ అధికారి (జీపీఓ) వెంకన్న, పంచాయతీ కార్యదర్శి విజయ, వ్యవసాయ శాఖ ఏవో తారాదేవి, ఏఈవో శ్రీకాంత్, విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్, ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ నర్సయ్య మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు



**సంస్థాన్ నారాయణపురం అక్టోబర్ 26 ( జనంసాక్షి):**
యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో మహాకవి మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు గుజ్జుల మునయ్య మాట్లాడుతూ సమాజానికి వాల్మీకి మహర్షి అందించిన రామాయణ కావ్యం, ఆయన బోధనలు మానవాళికి ఎప్పటికీ మార్గదర్శకమని కొనియాడారు. యువత వాల్మీకి ఆదర్శాలను జీవితంలో అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే తెలంగాణ వాల్మీకి బోయాలను, ఎస్టీ జాబితాలో చేర్చాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు భూపని రాములు, కార్యదర్శి బోయిని సుధాకర్, మాజీ ఉపాధ్యక్షులు కిష్ట దశరథ,బోయిని అంజయ్య, భూపని కృష్ణ, భూపని శంకరయ్య, గుజ్జుల ధనుంజయ, బోయిని గాలయ్య, గుజ్జుల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్లో ఉన్న భూ సమస్యలు పరిష్కరించాలని ప్రజావాణిలో వినతి

**ఎర్రుపాలెం, అక్టోబర్ 26 (జనంసాక్షి):**
భూ -రీ సర్వే పేరుతో రెవిన్యూ శాఖ అధికారులు పెండింగ్ లో ఉన్న భూ సమస్యలు పరిష్కరించడం లేదని సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు దివ్వెల వీరయ్య, మండల కార్యదర్శి మద్దాల ప్రభాకర్ రావు ఆరోపించారు. ప్రతి సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు నిర్వహిస్తున్న ప్రజావాణి లో భూ సమస్యల పరిష్కారం కోసం రైతులతో కలిసి సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో మండల అభివృద్ధి అధికారి శారదకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగులో ఉన్న రైతుల భూ సమస్యల పరిష్కారానికి భూ రీ సర్వేకు లింకు చేసి సమస్యల నుండి అధికారులు తప్పించుకోవడమేనని విమర్శించారు. ఎన్ని సంవత్సరాలకు భూ రీ సర్వే పూర్తి చేస్తారు? ఎప్పటికీ రైతుల పెండింగ్ సమస్యలను పరిష్కరిస్తారో చెప్పాలని ప్రశ్నించారు. సంవత్సరాల తరబడి రైతులు చెప్పులు అరిగేలాగ తహసిల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారని, భూ రీ సర్వేకు సంబంధం లేకుండా రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



ప్రజావాణిలో పరిష్కారం కొరకు ప్రజలు ఇచ్చిన ఏ ఒక్క దరఖాస్తు పరిష్కరించలేదని విమర్శించారు. ప్రజావాణికి అన్ని శాఖల అధికారులు హాజరు కారని సమస్యలు పరిష్కారం కావని పనికిమాలిన ప్రజావాణి దండగని ప్రజల విమర్శిస్తున్నారని అన్నారు. ప్రజావాణి కార్యక్రమం లేకపోతే సోమవారం అధికారులు తమ కార్యాలయంలో ఉండి ప్రజలకు పనైనా చేసి పెడతారని అన్నారు. ప్రభుత్వ అధికారులు ప్రజావాణిలో ఇచ్చిన ప్రతి దరఖాస్తును సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు కొండేపాటి గురవయ్య ఉన్నం శ్రీనివాసరావు, శివయ్య, గాలి సాహెబ్, బేజ్జం నాగమల్లేశ్వరావు,తదితరులు పాల్గొన్నారు.

## మేళ్లచెరువు శంభుని సన్నిధిలో సోమవారం సందడి



**మేళ్లచెరువు జనంసాక్షి :**
మేళ్లచెరువు గ్రామంలోని శ్రీ స్వయంభూ శంభు లింగేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుండే భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది, ముందుగా స్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, వైభవంగా వాయు లింగ అభిషేకం, ఇష్టకామేశ్వరి అమ్మవారికి పంచామృత అభిషేకం, రాహు -కేతువులకు అభిషేకాలు నిర్వహించారు, అనంతరం గోమాతకు ప్రత్యేక పూజలు చేసి స్వామివారికి మహానివేదన, హారతి సమర్పించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు, అనంతరం మేళ్లచెరువు గ్రామానికి చెందిన నక్క ముడెం అప్పిరెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా అన్నప్రసాద వితరణ నిర్వహించారు, ఈ కార్యక్రమంలో హుజూర్నగర్ వాస్తవ్యులు రిటైర్డ్ ఏసీపీ సుంకి సురేందర్ రెడ్డి, అర్చకులు కొంగపాక విష్ణువర్ధన్ శర్మ, ధనుంజయ శర్మ, ఈవో నాగేళ్ల శంబిరెడ్డి, ఉత్సవ కమిటీ అధ్యక్షులు పెండ్లి లచ్చయ్య, ధర్మకర్తలు వెంకట్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వరగాని నాగరాజు, అంజిరెడ్డి, రామారావు, దేవమని కందుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పెద్దిరెడ్డి కళ్యాణ్ చక్రవర్తి జన్మదిన వేడుకలు

**సూర్యాపేట (జనంసాక్షి):**
డీసీసీ జనరల్ సెక్రటరీ పెద్దిరెడ్డి కళ్యాణ్ చక్రవర్తి జన్మదిన వేడుకలను సోమవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పెద్దిరెడ్డి రాజా ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలు కాంగ్రెస్ శ్రేణులు, అభిమానుల సందడి మధ్య ఉత్సాహంగా సాగాయి. ఈ సందర్భంగా నాయకులు, అభిమానులు కళ్యాణ్ చక్రవర్తికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు. ఆయన ఆయురారోగ్యాలతో, ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న కళ్యాణ్ చక్రవర్తి మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ షఫీవుల్లా, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కౌన్సిలర్ వెలుగు వెంకన్న, రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్ వైస్ చైర్మన్



తండు శ్రీనివాస్ యాదవ్, ప్రముఖ వైద్యులు కౌన్సిలర్ డాక్టర్ వూర రామ్మూర్తి యాదవ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శులు నేరెళ్ల మధు గౌడ్, షేక్. మీరా, మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుడిపూడి వెంకటేశ్వర్లు, మనం వికాస వేదిక అధ్యక్షుడు, సుధా బ్యాంక్ ఎండి. పెద్దిరెడ్డి గణేష్, డ్రగ్గిస్ట్ కెమిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు యామ ప్రభాకర్, అప్పం శ్రీనివాస రావు, మాజీ కౌన్సిలర్లు నిమ్మల వెంకన్న, తండు శ్రీనివాస్ గౌడ్, నాయకులు పిల్లల రమేష్ నాయుడు, వల్దాస్ దేవేందర్, పెద్దిరెడ్డి రేయాన్ చక్రవర్తి, మందారి డేవిడ్ కుమార్, బూర వెంకటేశ్వర్లు, కొత్తపల్లి శివకుమార్, మట్టిపల్లి సైదులు, రమణాచారి, సట్టు నాగయ్య, భూపతి రాములు తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధి కూలీలకు పూర్తి స్థాయిలో పని కల్పించాలి

### అదనపు డీఆర్డీఓ చంద్రశేఖర్

జాజిరెడ్డిగూడెం మండల (**జనంసాక్షి**):
ఎల్ నినో ప్రభావం దృష్ట్యా ఏర్పడిన పరిస్థితుల వల్ల వీబీజీ రామ్ జీ ఉపాధి హామీ పనిలో ఎక్కువ మంది కూలీలకు పని కల్పించాలని జిల్లా అదనపు డీఆర్డీఓ చంద్రశేఖర్ కోరారు. సోమవారం జాజిరెడ్డి గూడెం, అర్వపలలో ఉపాధి హామీ (వీబీజీ రామ్ జీ ) పనులను ఆయన పరిశీలించారు. అన్ని గ్రామాలలో పనులు మంజూరు చేసి ప్రతి కూలీకి పని కల్పించాలని సిబ్బందికి సూచించారు. కూలీలకు కొలతల ప్రకారం ప్రతి రోజు రూ. 308 కూలీ పడుతుందని తెలిపారు.?జాజిరెడ్డిగూడెంలో ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించాలని సర్పంచ్ బింగి కృష్ణమూర్తి అదనపు డీఆర్డీఓకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పల్లపు ఝూన్సీ, ఏపీఓ ఇరుగు నాగయ్య, టీపీ దీపిక, ఫీల్డ్ అసిస్టెంట్ ఎం. మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



## స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం

జాజిరెడ్డిగూడెం మండలం (**జనంసాక్షి**):
జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని లోయపల్లి గ్రామానికి చెందిన గెండెల ధనుంజయ్ ఇటీవల అకాల మరణం చెందారు. దీంతో గ్రామంలోని శాంతినికేతన్ పాఠశాలలో 2010?2011 విద్యాసంవత్సరానికి చెందిన పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు తమతో విద్యాభ్యాసించి అకాల మరణం చెందిన ధనుంజయ్ కుటుంబాన్ని ఆదుకోవాలని నిర్ణయించుకున్నారు. ఇందుకోసం విరాళాల ద్వారా రూ. 23,200 ఆర్థికసాయాన్ని సేకరించి, ఆ మొత్తాన్ని మృతుడి కుటుంబీకులకు సోమవారం అందజేశారు. తమ బ్యాచ్ విద్యార్థులకు ఏ ఆపద వచ్చినా తాము అదుకుంటూనే ఉంటామని వారు ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ బ్యాచ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రక్తదానం ప్రాణదానంతో సమానం

- అత్యవసర సమయంలో క్షతగాత్రులకు ఇది చాలా ఉపయోగం
- పోలీసు అమరవీరుల త్యాగాలకు గుర్తుగా రక్తదాన శిబిరం ఏర్పాటు
- జిల్లా ఎస్పీ కె.నరసింహ

**సూర్యాపేట (జనంసాక్షి):**
పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలలో భాగంగా సోమవారం పోలీసు అమరవీరుల త్యాగాల జ్ఞాపకార్థం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ కె.నరసింహ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. జిల్లా ఎస్పీ మొదటగా రక్తదానం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు అమరవీరుల త్యాగాల స్మారకంగా ఈ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశామని, ప్రజా సేవలో పోలీస్ శాఖ ముందుందని అన్నారు. అత్యవసర సమయాల్లో ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని ఈ కార్యక్రమం ద్వారా తెలియజేశామన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయం నందు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఖమ్మంకు చెందిన సికిల్ సెల్ సొసైటీ వారు తలసేమియా వ్యాధితో బాధపడుతున్న పిల్లల కోసం రక్తాన్ని సేకరించారు. పోలీసుల త్యాగాలు బలిదానాలను ప్రజలు గుర్తించాలని,



శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులతో భాగస్వామ్యం కావాలని విజ్ఞప్తి చేశారు. రక్తదానం ప్రాణదానమని, ప్రమాదాల బారిన పడిన క్షతగాత్రులకు అత్యవసర సమయంలో ఎందరో రక్తం అందక ప్రాణాలు కోల్పోతున్నారని, అలాంటి పరిస్థితి రాకుండా అవసరమైన వారికి సరైన సమయంలో రక్తం అందాలని రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. పెద్ద ఎత్తున యువత తరలివచ్చి రక్తదానం చేయడం సంతోషకరమైన విషయమని అన్నారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న పిల్లలకు ఉపయోగపడే విధంగా స్వచ్ఛంద సంస్థ వారు కూడా దాతల నుండి రక్తాన్ని సేకరించారు. ఈ శిబిరం నందు పోలీసు సిబ్బంది, ఆటో యూనియన్ వారు కలిసి 150 మందికి పైగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, ఏఆర్ డీఎస్పీ నరసింహా చారి, డిసిఆర్బీ డిఎస్పీ రవి, సిఐలు రాజశేఖర్, నాగేశ్వరరావు, వెంకటయ్య, రామారావు, శివ కుమార్, ఆర్ఐ లు ప్రవీణ్ కుమార్, జానయ్య, పోలీసు సంఘం అధ్యక్షులు రమేష్, శంకర్ నాయక్, సెక్రెటరీ కిరణ్, సంఘ సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 24వ పద్మశాలి దసరా మేళాకు ఆహ్వాన పత్రికల అందజేత

## పద్మశాలీల ఐక్యత,సమాజ సర్వతోముఖాభివృద్ధే లక్ష్యం

**సంస్థాన్ నారాయణపురం: అక్టోబర్ 26 (జనంసాక్షి):** హైదరాబాద్‌లోని ఆటోనగర్ హరిణి వనస్థలి పార్కులో నవంబర్ 01, 2026(ఆదివారం )నిర్వహించనున్న 24వ పద్మశాలి దసరా మేళాకు సంస్థాన్ నారాయణపురం పద్మశాలి సంఘంలో దసరా మేళా వైస్ చైర్మన్ జెల్లా సూర్యకాంత్ నేత, కార్యదర్శి చెరుపల్లి ప్రభాకర్ నేత ఆధ్వర్యంలో చేనేత పద్మశాలి కుల సంఘం, శ్రీ మార్కండేయ స్వామి దేవస్థానం, చేనేత సహకార సంఘం, పద్మశాలి యువజన సంఘం, చేనేత కార్మిక సంఘం, ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ నిర్మాణ కమిటీ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులకు ఆహ్వాన పత్రికలను అందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ పద్మశాలి సమాజ సర్వతోముఖాభివృద్ధి, కులబాంధవుల మధ్య ఐక్యతను పెంపొందించడమే లక్ష్యంగా 24వ దసరా మేళాను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నవంబర్ 01వ తేదీ (ఆదివారం)ఉదయం 10:30, ప్రారంభమయ్యే ఈ కార్యక్రమం సాయంత్రం 6 గంటల వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు వైద్య శిబిరాలు దసరా మేళాలో ఆహ్లాదకరమైన వాతావరణంలో అలరించే సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు మహిళలు, చిన్నారుల కోసం ప్రత్యేక క్రీడలు, ప్రముఖుల సందేశాలు, ప్రతిభావంతులకు సన్మానాలు, ఉచిత వైద్య శిబిరాలు, వివాహ పరిచయ వేదికలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. హరిణి వనస్థలి పార్కు ఆవరణలో అందంగా ముస్తాబైన వేదికపై వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పద్మశాలి కులబాంధవులు తమ కుటుంబ సభ్యులతో కలిసి పెద్ద సంఖ్యలో హాజరుకావాలని నిర్వాహకులు కోరారు. పద్మశాలి సమాజ ఐక్యత, సంఘటిత శక్తిని చాటుతూ 24వ దసరా మేళాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నారాయణపురం 4వ వార్డు మెంబర్ సూరపెల్లి వెంకటేశం, 3వ వార్డు



సింగం బిక్షపతి, పద్మశాలి కుల సంఘం ప్రధాన కార్యదర్శి వంగరి రఘు, శ్రీ మార్కండేయ స్వామి దేవస్థానం అధ్యక్షుడు సూరపెల్లి కుచేల్, చేనేత సహకార సంఘం కార్యదర్శి దోర్నాల అంజయ్య, కోశాధికారి సంగిశెట్టి అనంత, మేకని యాదగిరి, చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు సంగిశెట్టి ధనుంజయ, రిపోర్టర్ సింగం కృష్ణ, విడం సాయి కిషోర్, గంజి రాజేష్, సంఘం మేనేజర్ మేడం వెంకటేశం, ప్రొడక్షన్ ఇన్‌చార్జి గుర్రం సత్యనారాయణ, తదితరులు, పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇంటి ప్రొసీడింగ్ పత్రం అందజేత

**హాలియా: జనం సాక్షి అక్టోబర్ 26**
హాలియా మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డుకు చెందిన నోముల శ్రావణికి ఇందిరమ్మ ఇంటి ప్రొసీడింగ్ పత్రాన్ని వార్డు కౌన్సిలర్ నకిరేకంటి అన్నపూర్ణ?సైదులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి చొరవ, మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి సహకారంతో అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా లబ్ధి చేకూరుతోందని తెలిపారు. పేద కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో 8వ వార్డు కౌన్సిలర్ గౌహర్ జబీన్ మజహార్, ఎండీ మజహార్, నకిరేకంటి సైదులు, మల్లారెడ్డి, సంతోష్ రెడ్డి, నోముల మహేష్, లింగస్వామి, మున్సిపల్ అధికారులు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజాధనానికి కన్నం అధికారుల పచ్చ జెండా!

◆ప్రజాధనానికి గండి పంచాయతీ సెక్రటరీ రాయబారాలు బట్టబయలు!

◆ఇసుకబావిగూడెంలో నిధుల పక్కదోవ లేని మోటార్లకు ఎం బి రికార్డులు!

◆చెయ్యని పనులకు లక్షల బిల్లుల స్వాహా ఆధారాలతో ఎంపీడీవోకు వల్లభ్ దాస్ చంద్రశేఖర్ ఫిర్యాదు!



**మాడుగుల పల్లి అక్టోబర్ 26 (జనం సాక్షి):** మండలం ఇసుకబావిగూడెం గ్రామపంచాయతీలో నిధుల దుర్వినియోగం తీవ్ర కలకలం రేపుతోంది గ్రామాభివృద్ధి కోసం ప్రభుత్వం విడుదల చేసిన నిధులను స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు కుమ్మక్కై యథేచ్ఛగా స్వాహా చేశారని గ్రామానికి చెందిన వల్లభ్ దాస్ చంద్రశేఖర్ ఆరోపించారు ఈ మేరకు అక్రమాలకు సంబంధించిన పక్కా ఆధారాలతో సోమవారం ఆయన మండల పరిషత్ అభివృద్ధి అధికారికి లిఖితపూర్వక ఫిర్యాదు అందజేశారు.

**లేని మోటార్లకు బిల్లులు ఓకే!**

గ్రామంలో ఎక్కడా ఆరు హెచ్‌పీ మోటర్లే లేకపోయినా, ఉన్నట్లుగా తప్పుడు రికార్డులు సృష్టించారని వారు ఆరోపించారు ఆ మోటార్లకు వైర్లు అల్లిచ్చామంటూ కొలతల పుస్తకంలో (ఎంబీ) రికార్డులు నమోదు చేయించి బిల్లులు నొక్కేయడం ఇక్కడి అక్రమాలకు పరాకాష్ఠగా నిలిచిందని మండిపడ్డారు.

**మట్టి పోసి బిల్లుల మాయ!**

గ్రామ డ్రైనేజీ వ్యవస్థ, వీధిదీపాల నిర్వహణ పేరిట సొంత స్వలాభం కోసం నిధులు దారిమళ్లించారని వారు ఆరోపించారు కేవలం మట్టి పోసి పనులు పూర్తి చేసినట్లు రికార్డులు సృష్టించి గ్రామపంచాయతీ నిధులను నొక్కేశారని తెలిపారు.

**బట్టబయలైన సెక్రటరీ రాయబారాలు**

ఈ అక్రమాల బాగోతం వెలుగులోకి వస్తుందనే భయంతో పంచాయతీ సెక్రటరీ, స్థానిక ప్రజాప్రతినిధులు రంగంలోకి దిగారని వారు ఆరోపించారు వ్యవహారాన్ని ఎలాగైనా సర్దుబాటు చేయాలని, ఎవరికీ తెలియకుండా సెక్రటరీ స్వయంగా ఫోన్లలో రహస్య రాయబారాలు నడిపారని, ఇందుకు సంబంధించిన పక్కా ఆడియో రికార్డింగ్‌లు తమ వద్ద ఉన్నాయని వారు వెల్లడించారు.

**సమగ్ర విచారణ జరిపించాలి**

వినతిపత్రం అందజేసిన అనంతరం చంద్రశేఖర్ విలేకరులతో మాట్లాడుతూ స్థానికంగా అక్రమార్కులకు కొమ్ముకాస్తున్న అధికారులపై, నిధులు తిన్న ప్రజాప్రతినిధులపై జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించి సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు ప్రజాధనాన్ని లూటీ చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

(గమనిక: ఇసుకబావిగూడెం నిధుల దుర్వినియోగానికి సంబంధించిన పూర్తి ఆధారాలు, ఆడియో రికార్డింగ్‌లతో కూడిన సంచలనాత్మక సమగ్ర కథనం త్వరలో 'జనం సాక్షి'లో ప్రచురితం కానుంది!)

## మోటకొండూరు ఎస్సై కుమారస్వామి యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా రక్తదానం

**పోలీసు అమరవీరుల సంస్మరణార్థం స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన యువకులు, సిబ్బంది**




**మోటకొండూరు, అక్టోబర్ 26 (జనంసాక్షి):** పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం భువనగిరి పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో మోటకొండూరు ఎస్సై కుమారస్వామి యాదవ్ మరియు పోలీస్ సిబ్బంది, స్థానిక యువకులు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. దేశం కోసం ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ, ఆపదలో ఉన్న ప్రాణాలను కాపాడటమే లక్ష్యంగా ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మోటకొండూరు ఎస్సై కుమారస్వామి యాదవ్‌తో పాటు పోలీస్ సిబ్బంది ఆర్. ప్రదీప్ కుమార్, వై. సంతోష్ రెడ్డి, మహమ్మద్ జలీల్ స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. వీరితో పాటు మోటకొండూరు ప్రాంతానికి చెందిన యువకులు కడపర్తి మణిదీప్, ఎత్తరి సాయి దిలీప్, జంపాల నితిన్, జక్క కరుణాకర్ రెడ్డి, పన్నాల నవీన్ రెడ్డి, దేవరకొండ రవి మరియు అలిమినేటి సిద్ధారెడ్డి తదితరులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి రక్తదానం చేసి తమ మానవత్వాన్ని చాటుకున్నారు. ప్రాణాలను కాపాడే రక్తదాన కార్యక్రమంలో పోలీసులు, యువకులు భాగస్వాములు కావడం పట్ల పలువురు వారిని అభినందించారు.

# శ్మశాన వాటిక కబ్జా, సమాధుల ధ్వంసం

◆కలెక్టర్ ఆదేశాలతో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత

◆బాధితులపై కుల వివక్ష, బూతులు తిడుతూ బెదిరింపులు

◆ఆక్రమణదారులు, ధ్వంసానికి పాల్పడిన వారిపై ఎస్సీ/ఎస్టీ కేసు నమోదుకు డిమాండ్



**మాడుగులపల్లి, అక్టోబర్ 26 (జనంసాక్షి):** నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండలం చిరుమర్తి గ్రామంలో మాదిల కులస్తులకు చెందిన శ్మశాన వాటిక భూమిని ఆక్రమించడమే కాకుండా, అక్కడున్న సమాధులను ధ్వంసం చేసిన ఘటనపై బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు ఈ విషయమై గతంలో జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేయగా, తక్షణమే పరిశీలించి చర్యలు తీసుకోండి అంటూ తహసీల్దార్‌కు కలెక్టర్ రాసిన ఆమోదపత్రం (ఫార్వర్డెడ్ కాపీ)తో సోమవారం బాధిత గ్రామస్తులు మాడుగులపల్లి తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు.

**అధికారుల కొలత రాళ్లను సైతం తొలగించి కబ్జా**

బాధితులు తెలిపిన వివరాల ప్రకారం చిరుమర్తి గ్రామంలోని సర్వే నంబర్ 318లో మాదిల కులస్తుల శ్మశాన వాటికకు కేటాయించిన 3.26 ఎకరాల భూమిలో 30 కుంటల స్థలాన్ని తండు రాములు ఆక్రమించుకున్నాడు గతంలో రెవెన్యూ సర్వేయర్లు, ఆర్ఐ భూమిని కొలిచి హద్దు రాళ్లను ఏర్పాటు చేసినప్పటికీ, వాటిని తొలగించి అక్రమంగా స్వాధీనం చేసుకున్నారని ఆరోపించారు.

**రెండోసారి సమాధుల ధ్వంసం అడిగితే కులం పేరుతో దూషణలు**

శ్మశాన వాటికలో నిర్మించుకున్న నామ చిన్న వెంకన్న, నామ చంద్రమ్మ, నామ అరుణ్ కుమార్ ల సమాధులను తండు రాములుతో పాటు తండు దుర్గమ్మ, తండు మట్టయ్య, తండు సాయమ్మ, తండు సైదులు, తండు నాగరాజు, తండు పద్మ, తండు మహేష్‌లు కలిసి ధ్వంసం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో దీనిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా, ధ్వంసమైన సమాధులను బాగు చేసుకున్నామని కానీ మళ్లీ రెండోసారి ఉద్దేశపూర్వకంగానే వాటిని కూల్చివేశారని వాపోయారు దీనిపై ప్రశ్నించిన తమను, గ్రామ మహిళలను అసభ్యకర పదజాలంతో బూతులు తిడుతూ, మీరు నన్ను ఏమీ చేయలేరు అని కులం పేరుతో అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు.

**న్యాయం చేయాలని డిమాండ్**

కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి శ్మశాన వాటికకు సరిహద్దులు నిర్ణయించి రక్షణ కల్పించాలని, కూల్చివేసిన సమాధులకు నష్టపరిహారం ఇప్పించాలని కోరారు అదేవిధంగా బాధితులను కులం పేరుతో దూషించి, సమాధులను ధ్వంసం చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో గ్రామ బాధితులు సైదులు, ముత్తయ్య, బి. నాగయ్య, ఎన్. సాయికుమార్, ఎం. శ్రీనివాస్, పి. వంశీ, రమేష్ తదితరులు ఉన్నారు.

# గోడుకొండ్లను ఫ్యూచర్ సిటీలో చేర్చాలి!

**రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు జేఏసీ నాయకుల వినతి**

**త్వరలో గ్రామ సమస్యను పరిష్కరిస్తాం.. కలెక్టర్ నారాయణ రెడ్డి హామీ**





**చింతపల్లి, నవంబర్ 26(జనంసాక్షి)** చింతపల్లి మండలం గోడుకొండ్ల (మాల్ టౌన్) గ్రామాన్ని పూర్తిగా ఫ్యూచర్ సిటీ పరిధిలో చేర్చి, అధికారిక మాస్టర్ ప్లాన్‌లో తగిన స్థానం కల్పించాలని కోరుతూ జేఏసీ నాయకులు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. గ్రామ అభివృద్ధికి ఆటంకంగా మారిన రెండు జిల్లాల సరిహద్దు సమస్యను పరిష్కరించి, గ్రామానికి న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ నారాయణ రెడ్డి మాట్లాడుతూ.. గతంలో తాను నల్లగొండ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేసిన సమయంలోనూ గ్రామ సమస్యపై తనను కలిశారని గుర్తుచేశారు. రెండు జిల్లాల సరిహద్దు గ్రామంగా గోడుకొండ్ల ఎదుర్కొంటున్న సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందని తెలిపారు. గ్రామ సమస్యను త్వరలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామ భవిష్యత్తు, అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని గోడుకొండ్లను ఫ్యూచర్ సిటీ పరిధిలో పూర్తిస్థాయిలో చేర్చడంతోపాటు, అధికారిక మాస్టర్ ప్లాన్‌లో స్థానం కల్పించడం అత్యవసరమని జేఏసీ నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు సందుపట్ల లక్ష్మణ్ సాగర్, కాషగోని యాదయ్య, సందుపట్ల రాము సాగర్, దొంతగోని జంగయ్య, అయిలాగోని రాజీవ్ తదితరులు పాల్గొన్నారు....

# ఆంధ్రాకు నీళ్లు.. తెలంగాణ రైతులకు కన్నీళ్లు

## రేవంత్ సర్కార్ నిర్లక్ష్యం: బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పీజేఆర్ ధ్వజం

ఆంధ్రప్రదేశ్‌కు కృష్ణా జలాలు తరలిపోతున్నా తెలంగాణ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పీజేఆర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. తెలంగాణ రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడుతుంటే.. ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని మండిపడ్డారు.సోమవారం గుర్రంపోడు మండల కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పీజేఆర్ మాట్లాడారు. గుర్రంపోడు, శ్రీశైలం, నాగార్జునసాగర్ ద్వారా కృష్ణా జలాలను ఆంధ్రప్రదేశ్‌కు తరలించుకుపోతున్నారని, అయినా తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ సుమారు 80 టీఎంసీల నీటిని తరలించుకుపోయిందని, తెలంగాణ ప్రభుత్వం మాత్రం కేవలం 20 టీఎంసీల నీటిని మాత్రమే వినియోగించుకోగలిగిందని పీజేఆర్ పేర్కొన్నారు. రాష్ట్రంలో బోర్లు ఎండిపోయి, సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో తాగునీటి కష్టాలు సాగునీటి సమస్యతోపాటు గ్రామాల్లో తాగునీటి సమస్యలు కూడా తీవ్రంగా ఉన్నాయని పీజేఆర్ అన్నారు. మిషన్ భగీరథ ద్వారా సైతం సక్రమంగా తాగునీరు అందడం లేదని ఆరోపించారు. ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. కేసీఆర్ పాలనకు.. కాంగ్రెస్ పాలనకు తేడా ఇదే రైతాంగాన్ని, ప్రజలను గాలికొదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి.. గత కేసీఆర్ పాలనకు ఉన్న తేడా ప్రస్తుతం ప్రజలకు స్పష్టంగా కనిపిస్తోందని పీజేఆర్ అన్నారు.




తెలంగాణకు దక్కాల్సిన కృష్ణా జలాల విషయంలో ప్రభుత్వం తక్షణమే స్పందించి రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 37 ఏడేళ్ల తర్వాత అపూర్వ రీతిలో తిమ్మాపురం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

జాజిరెడ్డిగూడెం మండల (జనంసాక్షి): బడి గుమ్మాలు దాటి ముప్పై ఏడేళ్లు గడిచినా... నాటి బాల్యపు మధుర స్మృతులు చెదరవని తిమ్మాపురం జెడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థులు నిరూపించారు. 1988?89 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదువు ుకున్న మిత్రులంతా సోమవారం అడివెల క్రాస్‌రోడ్డులోని ఆర్ కె ఫంక్షన్ హాల్ లో ఆత్మీయ సమ్మేళనంను నిర్వహించుకున్నారు.



సుదీర్ఘ కాలం తర్వాత ఎదురుపడిన స్నేహితులను చూసి ఆప్యాయంగా పలకరించుకుంటూ చిన్ననాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. పాఠశాల రోజులను నెమరువేసుకుంటూ పాఠశాలలో కలిసి గడిపిన అల్లరి రోజులు, గురువుల బోధనా తీరు, నాటి స్నేహాలు, సరదా సంఘటనలను తలచుకుంటూ అందరూ భావోద్వేగానికి లోనయ్యారు. అంతకుముందు వారు తాము చదువుకున్న పాఠశాలను సందర్శించి, నాటి గదులను తిలకించి చిన్ననాటి జ్ఞాపకాలను మరోసారి మనసులో నింపుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పి తీర్చిదిద్దిన గురువులు కొంతం శ్రీనివాసరెడ్డి, సీహెచ్. స్వరాజ్యం, భాగ్యలక్ష్మిలను ఈ వేదికపై ఘనంగా సన్మానించి పాదాభివందనం చేశారు. ఈ సందర్భంగా తమతో పాటు చదువుకుని, ఇంతకాలానికి దూరమైన పలువురు మిత్రులు మృతి చెందడం పట్ల సమ్మేళనంలో సంతాపం వ్యక్తం చేసి ఘనంగా నివాళులర్పించారు.

## ఏలినినో ప్రభావంతో యాసంగిలో రైతులు ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలి శాస్త్రవేత్త ఏ కిరణ్



**తుంగతుర్తి అక్టోబర్ 26 (జనం సాక్షి)** ఏలినోనో ప్రభావంతో రైతులు యాసంగిలో ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు భూసార పరిరక్షణ తోనే భవిష్యత్ తరాలకు సారవంతమైన నేల అందించవచ్చునని వ్యవసాయ శాస్త్రవేత్త ఏ కిరణ్ అన్నారు, సోమవారం మండల పరిధిలోని గొట్టిపర్తి రైతు వేదికలో కేతు బచావో అభియాన్ కార్యక్రమం పై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు, ఈ సందర్భంగా రైతులకు భూసార పరిరక్షణ, నేల ఆరోగ్యం, సమతుల్య ఎరువుల వినియోగం, వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటల ఎంపిక తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయంలో దీర్ఘకాలిక ఉత్పాదకతను పెంపొందించాలంటే నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడం ఎంతో అవసరమని తెలిపారు, నేల ఆరోగ్యం వ్యవసాయ ఉత్పాదకతకు పునాది అని, భూమిలో సేంద్రియ కర్బన శాతాన్ని పెంపొందించడం ద్వారా నేల భౌతిక, రసాయనిక, జీవ లక్షణాలు మెరుగుపడతాయని తెలిపారు. నేలలో సేంద్రియ పదార్థాలు తగిన స్థాయిలో ఉండటం వల్ల నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం పెరగడంతో పాటు పంటలకు అవసరమైన పోషకాల లభ్యత మెరుగు పడుతుందని పేర్కొన్నారు. పంట అవశేషా లను తగలబెట్టకుండా నేలలో కలియ దున్నడం, పచ్చిరొట్ట ఎరువుల వినియోగం, అందుబాటులో ఉన్న సేంద్రియ ఎరువులను శాస్త్రీయ పద్ధతిలో ఉపయోగించడం వంటి చర్యలు భూసార పరిరక్షణకు దోహదపడ తాయని వివరించారు. ఉపయోగించాలని సూచించారు. దీనివల్ల అనవసరమైన పెట్టుబడి వ్యయాన్ని తగ్గించుకోవడంతో పాటు నేల ఆరోగ్యాన్ని దీర్ఘకాలం కాపాడుకోవచ్చని తెలిపారు. రైతులు ప్రతి పంట సీజన్‌కు ముందు లేదా అవసరమైన వ్యవధిలో భూసార పరీక్షలు చేయించుకొని, పరీక్షల ఆధారంగా నత్రజని, భాస్వరం, పొటాష్ తదితర పోషకాలను సమతుల్యంగా అందించాలని సూచించారు. సూక్ష్మపోషకాల లోపాలను గుర్తించి తగిన నివారణ చర్యలు చేపట్టడం, పంట మార్పిడి పద్ధతులను పాటించడం, నేల కోతను నివారించే చర్యలు చేపట్టడం ద్వారా వ్యవసాయ భూముల సారాన్ని మెరుగుపరచుకోవచ్చని వివరించారు. పంటను ఎంపిక చేసుకునే ముందు నేల స్వభావం, నీటి లభ్యత, విత్తనాల అందుబాటు, మార్కెట్ డిమాండ్, ఆశించిన దిగుబడి, పెట్టుబడి వ్యయాలను పరిగణనలోకి తీసుకోవాలని తెలిపారు. పంటల వైవిధ్యాన్ని ప్రోత్సహించడం ద్వారా నీటి వనరులపై ఒత్తిడిని తగ్గించడంతో పాటు వ్యవసాయంలో ఎదురయ్యే వాతావరణ సంబంధిత నష్టాలను కొంతవరకు తగ్గించుకోవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న సహాయ వ్యవసాయ విస్తరణ అధికారి జ్యోత్స్న, హార్టికల్చర్ అధికారి శ్రీ ముత్యం రాజు పంచాయతీ సెక్రటరీ శ్రీధర్ రైతులు పాల్గొన్నారు.



# గిరి అంతమ్మ మృతి బాధాకరం

## మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నరసింహ

**కొండమల్లేపల్లి, అక్టోబర్ 26 (జనంసాక్షి):** కొండమల్లేపల్లి మండల పరిధిలోని గుమ్మడవల్లి గ్రామానికి చెందిన గిరి అంతమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న దేవరకొండ మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నరసింహ సోమవారం గ్రామంలోని వారి స్వగృహంలో ఆమె మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కష్టకాలంలో గిరి అంతమ్మ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ భగవంతుడు వారి కుటుంబానికి అన్ని విధాలా మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. భగవంతుడు వారి కుటుంబానికి ఈ విషాదాన్ని తట్టుకునే శక్తిని ప్రసాదించాలని ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. గిరి వెంకటయ్య కుటుంబానికి అన్ని విధాలుగా తన సహాయ సహకారాలు ఉంటాయని పేర్కొన్నారు. వారివెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కాసర్ల వెంకటేశ్వర్లు, మాజీ ఎంపిటిసిలు బొడ్డుపల్లి సైదులు, ఇస్లావత్ శంకర్ నాయక్, మాజీ సర్పంచ్ ఆదిరాల రాము, ఉప సర్పంచ్ బచ్చనబోయిన శ్రీనివాస్ యాదవ్, గిరి రామలింగం, గిరి వెంకటయ్య, బూరుగు లోకేష్, బొడ్డుపల్లి లాలయ్య, గిరి శేఖర్, మరుపాకుల ఏడుకొండలు, ప్రజా ప్రతినిధులు గ్రామ ప్రజలు తదితరులు ఉన్నారు.

## ఆనందోత్సాహాల నడుమ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

### ఆశయ సాధనలో మా లక్ష్య చేదనలో మార్గదర్శకులైన గురువులకు పాదాభివందనం

**కొండమల్లేపల్లి, అక్టోబర్ 26 (జనంసాక్షి):** గుడిపల్లి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల 1998– 2003 సంవత్సరం పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని సోమవారం గుడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆనందోత్సాహాల నడుమ ఘనంగా నిర్వహించుకున్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998–2003 సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు తమ తోటి స్నేహితులతో కలిసి వారికి చదువు చెప్పిన ఉపాధ్యాయులను పిలిచి స్వాగతించి పూలదండలు, శాలువాలతో సత్కరించి మెమొంటోలను అందజేసి గౌరవ వందనం చేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ 28 సంవత్సరాల తర్వాత మేము స్నేహితులందరము కలిసి చదువుకున్న పాఠశాలలో గెట్ టు గెదర్ కార్యక్రమాన్ని నిర్వహించుకోవడం పాత రోజులను సంతోషకరమైన, బాధాకరమైన, విషయాలను, గుర్తుచేసుకొని మాట్లాడుకోవడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాల నడుమ నాటి మధుర స్మృతులను నెమరేసుకున్నారు. సరిగ్గా 28 ఏళ్ల తరువాత వారంతా ఒక చోట చేరి నాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఎంజాయ్ చేశారు. విద్యార్థి దశలో చిలిపి చేష్టలు మరువలేనివని, విద్యా బుద్ధులు నేర్పిన గురువులు దేవరకొండ మండల విద్యాధికారి మాతృనాయక్, నల్గొండ మండల విద్యాధికారి అరుంధతి, గుడిపల్లి మండల విద్యాధికారి సముద్రాల శ్రీనివాస్ లతో గతంలో విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. నాటి ఉపాధ్యాయులను శాలువతో ఘనంగా సత్కరించి వారి ఆశీస్సులు స్వీకరించారు. పూర్వ విద్యార్థులందరూ ఒకేచోట చేరవడంతో సందడి నెలకొని వారి ముఖాల్లో వెలుగులు నిండాయి. ఇక నుంచి టచ్‌లో ఉండాలంటూ ఫోన్ నంబర్లు తీసుకోవడంతో పాటు మధుర జ్ఞాపకాలను తమ సెల్‌ఫోన్లలో బంధించుకున్నారు. ఈ కార్యక్రమంలో జాకీరా బేగం. అనసూయ, ప్రేమలత, వెంకటమ్మ, పుష్పలత, ప్రశాంతి, శంకర్, అంజిబాబు, చారి, యాదగిరి, సుఖీందర్, వెంకటయ్య, ఆంజనేయులు, నాగయ్య, కోటేశ్వర చారి, నావ మోహన్, గిరి, కొండల్, సైదులు, మైమూద్, ఆంజనేయులు, మోతిలాల్, పత్తి బాలయ్య, గౌతమ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

